




సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కృతికా శుక్లా

నగదు వసూలు చేస్తే ఉపేక్షించేది లేదు

వైద్యశాలలకు డిసిప్లినరీ కమిటీ మందలింపు

నరసరావుపేట లీగల్, నవంబరు17 (ఆంధ్రజ్యోతి): నిబంధనలకు విరుద్ధంగా ఎన్టీఆర్ వైద్య సేవ చికిత్సలకు నగదు వసూలు చేసిన వైద్యశాలల యాజమాన్యాలను జిల్లా డిసిప్లినరీ కమిటీ సోమవారం మందలించింది. భవిష్యత్తులో ఇలాంటి చర్యలు పునరావృతం అయితే ఉపేక్షించేది లేదని హెచ్చరించింది. కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ హాలులో సోమవారం కలెక్టర్ కృత్తికా శుక్ల అధ్యక్షతన జిల్లా డిసిప్లినరీ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో 40 ఫిర్యాదులను ఎన్టీఆర్ వైద్య సేవ జిల్లా కో-ఆర్డినేటర్ డాక్టర్ జి.చంద్రశేఖర్ కలెక్టర్‌కు, కమిటీ సభ్యులకు వివరించారు. ఎన్టీఆర్ వైద్యసేవ పేషెంట్లకు నగదు రహిత వైద్యం అందించేలా ఆసుపత్రి యాజమాన్యాలు తగు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో డీఎంహెచ్‌వో డాక్టర్ రవి, డీసీహెచ్ఎస్ డాక్టర్ ప్రసూన, డాక్టర్ విక్టర్ తదితరులు పాల్గొన్నారు.


నిర్మాణం తొలగింపును అడ్డుకుంటున్న భవన నిర్మాణ దారులు

కలెక్టర్ ఆదేశాలు బేఖాతరు

నరసరావుపేట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని స్టేషన్ రోడ్డుపై నిర్మించిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మెను తొలగించాలని కలెక్టర్ కృతికా శుక్లా మునిసిపల్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాలను అమలు చేసేందుకు వెళ్లిన మునిసిపల్ అధికారులకు ఆటంకం ఏర్పడింది. సోమవారం అక్కడికి వెళ్లిన వారిని భవన నిర్మాణదారులు అడ్డుకున్నారు. ఓ ప్రజాప్రతినిధి జోక్యంతో మునిసిపల్ సిబ్బంది అక్రమ కట్టడాన్ని తొలగించకుండా వెనుదిరిగారు. మునిసిపల్ అధికారుల నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మించిన విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ దిమ్మెను తొలగించాలని ఆ శాఖకు సూచించామని టీపీవో సాంబయ్య తెలిపారు. అక్రమ కట్టడం వాహన రాకపోకలకు అడ్డుగా ఉందని.. కలెక్టర్‌కు ఫిర్యాదులు వెళ్లాయని వెల్లడించారు.


మాట్లాడుతున్న జిల్లా రెవెన్యూ అధికారి మురళి

యువతకు స్ఫూర్తి.. యూనిటీ మార్చ్

జిల్లా రెవెన్యూ అధికారి మురళి

నరసరావుపేట రూరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): సర్దార్ 150 యూనిటీ మార్చ్ యువతలో స్ఫూర్తి నింపుతుందని జిల్లా రెవెన్యూ అధికారి మురళి పేర్కొన్నారు. నరసరావుపేటలో బుధవారం ఐక్యత పాదయాత్ర నిర్వహణపై సోమవారం కలెక్టరేట్‌లో డీఆర్వో విలేకరుల సమావేశం నిర్వహించి, వివరాలు వెల్లడించారు. ఉక్కు మనిషి సర్దార్ వల్లభభాయ్ పటేల్ 150వ జయంతిని స్మరించుకుని.. ఆయన నాయకత్వ ఆదర్శాలను "ఏక్ భారత్ - ఆత్మనిర్భర్ భారత్"గా యువత అనుసరించేలా ప్రేరేపించడం ఈ కార్యక్రమ లక్ష్యమన్నారు. ఈ యూనిటీ మార్చ్‌లో యువత, విద్యార్థులు పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. మై భారత్ ఉమ్మడి గుంటూరు జిల్లా ఉప సంచాలకులు కిరణ్మయి దేవిరెడ్డి మాట్లాడుతూ.. ఈ నెల 19న ఉదయం 10:30 గంటలకు ఎస్ఎస్ఎన్ కళాశాల క్రీడా మైదానం నుంచి యూనిటీ మార్చ్ మొదలై శివుడు బొమ్మ సెంటర్ మీదుగా తిరిగి కళాశాలకు చేరుకుంటుందని తెలిపారు. అక్టోబరు 6న యూనిటీ కాంపెయిన్‌లో భాగంగా సోషల్ మీడియా రీల్స్, రచనా పోటీల్లో ఎంపికైన 150 మంది విజేతలకు జాతీయ పాదయాత్రలో పాల్గొనే అవకాశం కలుగుతుందన్నారు. బీజేవైఎం రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబరు మహేష్, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ సరళకుమారి పాల్గొన్నారు.

నేటి నుంచి ఎడ్ల బండలాగుడు పోటీలు

కారంపూడి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): పల్నాటి వీరారాధన ఉత్సవాలను పురస్కరించుకొని మంగళవారం తెలుగు రాష్ట్రాల స్థాయి ఎడ్ల బండలాగుడు పోటీలను ప్రారంభిస్తున్నట్లు సొసైటీ చైర్మన్ రామకృష్ణ, టీడీపీ పట్టణ అధ్యక్షుడు బొమ్మిన శేషగిరిరావు తెలిపారు. రైతు సంఘం ఆధ్వర్యాన స్థానిక నూతన బస్టాండ్ సమీపంలో పోటీలు జరిగే గ్రౌండ్‌ను సోమవారం పరిశీలించారు.

పరిపూర్ణం.. భక్తిపారవశ్యం!


గుంటూరులో దీపారాధన చేస్తున్న మహిళ

కార్తిక మాసం చివరి సోమవారం శైవక్షేత్రాలు భక్త జన సంద్రంగా మారాయి. పవిత్ర మాసాంతం.. నియమ నిష్టలతో ఉన్న భక్తులు ఆలయాలకు భారీగా పోటెత్తారు. పుణ్యస్నానాలు ఆచరించి.. భక్తిపారవశ్యంతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు దీప నైవేద్యం సమర్పించి.. ఓం నమఃశివాయ పంచాక్షరి మంత్రం పఠిస్తూ.. మనసారా స్వామిని దర్శించుకున్నారు. పెదకాకాని మల్లేశ్వరస్వామికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. భక్తులు పొంగళ్లు పొంగించి.. మేళతాళాలతో ప్రదక్షిణలు చేశారు. ప్రథమ ఆరామం బాలచాముండికా సమేత అమరేశ్వరస్వామి ఆలయంలో కోటి దీపోత్సవం వైభవంగా జరిగింది. ఆలయానికి రాష్ట్ర నలుమూల నుంచి భారీ గా భక్తులు చేరుకున్నారు. కార్తిక దీపాల కాంతిలో కృష్ణాతీరం వెలుగులు విరజిమ్మింది. ప్రముఖ శైవ క్షేత్రం కోటప్పకొండలో శ్రీ మేధా దక్షిణామూర్తి స్వరూప త్రికోటేశ్వర స్వామికి పంచామృతాలు.. ఫలరస సహిత సుగంధ ద్రవ్యాలతో మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు వైభవంగా జరిగాయి. విశేష పుష్పాలకంరణ సేవ చేశారు.

\- నరసరావుపేట, అమరావతి, పెదకాకాని


అమరావతి అమరేశ్వరాలయంలో కోటి దీపోత్సవం


ప్రత్యేక అలంకరణలో కోటప్పకొండ త్రికోటేశ్వరుడు, అమరావతి అమరేశ్వరుడు




పెదకాకాని శివాలయంలో క్యూలైన్‌లో భక్తులు


అమరావతి వద్ద కృష్ణానదిలో భక్తుల పుణ్య స్నానాలు


భక్తులతో కిక్కిరిసిన సూర్యలంక తీరం


సౌత్ సెంట్రల్ రైల్వే జీఎం సంజయ్ కుమార్ శ్రీవాస్తవతో మాట్లాడుతున్న ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు

ప్రయాణికుల భద్రతను పటిష్ట పరచాలి

రైల్వే జీఎంకు ఎంపీ లావు వినతి

నరసరావుపేట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిధిలోని పలు రైల్వే సమస్యలను పరిష్కరించాలని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు కోరారు. ఈ మేరకు సోమవారం సౌత్ సెంట్రల్ రైల్వే జీఎం సంజయ్‌కుమార్ శ్రీవాస్తవకు వినతిపత్రం అందజేశారు. పల్నాడులో రాత్రిళ్లు ప్రయాణికుల భద్రతను పటిష్ఠం చేయాలని కోరారు. ఎంపీ వినతిపై రైల్వే జీఎం సానుకూలంగా స్పందించారు.

ఎంపీ విన్నవించిన అంశాలు

- బెల్లంకొండలోని ఎల్‌సీ నంబరు 53 వద్ద ఆర్‌వోబీని మంజూరు. గురిజవోలు, మేరికపూడి గ్రామాల మధ్య ఉన్న ఎల్‌సీ గేట్ 294ను.. 150 మీటర్లు పక్కకు తరలించాలి.
- పెదకూరపాడులోని ఎల్‌సీ నంబరు 27, సత్తెనపల్లిలోని 40, పిడుగురాళ్ల మండలం తుమ్మలచెరువు వద్ద నంబరు 81 వద్ద మంజూరైన రైల్వే ఓవర్ బ్రిడ్జి(ఆర్‌ఓబీ)నిర్మాణానికి టెండర్లు నిర్వహించి త్వరితగతిన పనులు ప్రారంభించాలి.
- మాచర్ల రైల్వేస్టేషన్ వెనుక ఫుట్‌పాత్, కాలువ నిర్మాణం, రోడ్డు నుంచి రైల్వేస్టేషన్ వరకు దెబ్బతిన్న రహదారిని పునరుద్ధరించాలి.
- గురజాల, రెంటచింతల రైల్వే స్టేషన్లలో ప్రాథమిక సౌకర్యాలు, మాచర్ల - విజయవాడ మెమూ రైలు (నెం.67228)కు అదనపు కోచ్‌లను ఏర్పాటు చేయాలి.
- పిడుగురాళ్ల రైల్వే స్టేషన్‌లో రైలు నెం.12795/12796 (ఉద్యోగుల రైలు), రైలు నెం.17221/17222 ఎల్‌టీటీ ఎక్స్‌ప్రెస్, భవనగర్ ఎక్స్‌ప్రెస్ (రైల్ నెం.12755/12756)లకు స్టాపేజ్ ఇవ్వాలని. పెదకూరపాడు రైల్వే స్టేషన్‌లో పల్నాడు ఎక్స్‌ప్రెస్ (ట్రైన్ నెం.12747/12748)కు, డెల్టా ఎక్స్‌ప్రెస్ (రైలు నెం. 17645 /17646)కు స్టాపేజ్ ఇవ్వాలి. పేరేచర్ల రైల్వే స్టేషన్‌లో రైలు నెం.17254 ఔరంగాబాద్ - గుంటూరు రైలును ఆపాలి. గుంటూరు - సికింద్రాబాద్ ఎక్స్‌ప్రెస్ (నెం. 12705/76) పేరును అనవేమ ఎక్స్‌ప్రెస్‌గా మార్చాలి.

వసతిపై.. వీడిన గ్రహణం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

- ఎట్టకేలకు వర్సిటీ పాలక మండలి సమావేశం
- రూ.19.60 కోట్ల నిధుల విడుదలకు ఆమోదం
- పూర్తికానున్న ఇంజనీరింగ్ కళాశాల వసతి గృహాలు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

నరసరావుపేట జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాలకు పట్టిన గ్రహణం వీడింది. ఎట్టకేలకు కాకినాడ జేఎన్‌టీయూలో పాలక మండలి సమావేశం జరిగింది. ఇందులో నరసరావుపేట కళాశాల అభివృద్ధిపై చర్చించారు. వీసీ సీఎస్ఆర్ ప్రసాద్ అధ్యక్షతన పాలక మండలి సమావేశం జరిగినట్లు వర్సిటీ వర్గాలు తెలిపాయి. నిధుల కొరతతో నిలిచిపోయిన పనుల పునరుద్ధరణకు నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. రూ.19.60 కోట్ల నిధులు విడుదలకు సమావేశంలో తీర్మానించినట్లు సమాచారం. నిధుల కొరతతో కాంట్రాక్టర్లు వసతి గృహాల నిర్మాణ పనులు నిలిపివేశారు. దీనిపై.. వీసీ హామీ హుళక్కి.. శీర్షికతో ఆంధ్రజ్యోతిలో వెలువడింది. దీనిపై స్పందించి.. పాలకమండలి సమావేశం నిర్వహించి.. నిధుల కేటాయింపుపై సంబంధిత అధికారులు నిర్ణయం తీసుకున్నారు.

నెల రోజుల్లో పనులు ప్రారంభం

పల్నాడు, బాపట్ల జిల్లాల సరిహద్దులో ఉన్న నరసరావుపేట జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో సుమారు 1,400 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. వీరికి వసతి లేక తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. బాలికల, బాలుర వసతి గృహాల నిర్మాణాలు తుది దశలో నిలిచిపోయాయి. దాదాపు ఏడాదిన్నరగా వర్సిటీ నిధులు విడుదల చేయకపో వడంతో కాంట్రాక్టర్లు పనులు నిలిపివేశారు. వసతి గృహాల నిర్మాణానికి ఈసీ సమావేశంలో రూ.10 కోట్లు మంజూరు చేసినట్లు సదరు అధికారులు తెలిపారు. బాలికల వసతి గృహం ప్రహరీకి రూ.1.10 కోట్లు, రహదారుల అభివృద్ధి, ప్రధాన గేటు ఏర్పాటు వంటి పనులకు రూ.8.50 కోట్లు కేటాయించినట్లు చెబుతున్నారు. దీంతో నెల రోజుల్లో పనులు ప్రారంభించే అవకాశాలు ఉన్నాయి. కళాశాల భవనంలో మరో ఫ్లోర్ నిర్మించాల్సి ఉంది. ఇందుకు గతంలో రూ.31.50 కోట్లు నిధులు మంజూరయ్యాయి. ఈ పనులకు సంబంధించి టెండర్ నిర్వహించాల్సి ఉంది. రూ.16 కోట్ల వ్యయంతో క్రీడా ప్రాంగణం నిర్మాణ పనులు చేపట్టగా ఇవి నత్తనడకన సాగు తున్నాయి. అలాగే కళాశాలలో ఆధ్యాపకుల కొరతపై చర్యలు చేపట్టనున్నారు. కాంట్రాక్ట్ విధానంలో అధ్యాపకులను నియ మించాలని పాలకమండలి నిర్ణయించినట్లు చెబుతున్నారు. ఇప్పటికైనా పనులు చేపట్టి వేగవంతం చేస్తే విద్యార్థులకు వసతి కష్టాలు తీరుతాయి.



సంక్రాంతి నుంచి ఎల్‌హెచ్‌బీ రైలుగా సర్కార్ ఎక్స్‌ప్రెస్ 6
ఎమ్మెస్సీ యోగ పరీక్ష ఫలితాల విడుదల
ఏఎన్‌యూలో ఆటల పోటీలు
వెలలేనివి వీరి సేవలు
● బిడ్డల కోసం గురువులుగా మారిన అమ్మలు 8

పదిలో అగ్రస్థానమే లక్ష్యం

- డీఈవో ఎల్.చంద్రకళ
- సబ్జెక్ట్ టీచర్లకు ముగిసిన శిక్షణ తరగతులు



నరసరావుపేట కల్చరల్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): వచ్చే ఏడాది మార్చిలో జరగబోయే పదవ తరగతి పబ్లిక్ పరీక్షల ఫలితాల్లో నూరుశాతం ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలని జిల్లా విద్యా శాఖాధికారి ఎల్.చంద్రకళ సబ్జెక్టు టీచర్లను ఆదేశించారు. కేసానుపల్లిలోని ఎంఏఎం ఇంజనీరింగ్ కళాశాలలో నరసరావుపేట, సత్తెనపల్లి డివిజన్ ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులకు వారం రోజుల నుంచి జరుగుతున్న సబ్జెక్టు ఓరియెంటేషన్ తరగతులు సోమవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా డీఈవో ఆంధ్రజ్యోతితో మాట్లాడారు. పది ఫలితాల్లో జిల్లాని అగ్రస్థానంలో ఉంచడానికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నామన్నారు. అందులో భాగంగానే రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా జిల్లాలో సబ్జెక్టు టీచర్లకు ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. తరగతిలోని సీ, డీ గ్రూపుల విద్యార్థులు పాఠ్యాంశంలో పట్టు సాధించేందుకు.. మెళకువలపై శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. సబ్జెక్టు నిపుణులతో ప్రత్యేక మెటీరియల్ తయారు చేయించి అన్ని పాఠశాలలకు అందించడం జరిగిందన్నారు. ఇప్పటికే పదవ తరగతి సిలబస్ పూర్తికావడంతో ఈ మెటీరియల్ పునశ్చరణ చేయిస్తే సీ, డీ గ్రూపుల్లో ఉన్న విద్యార్థులు తప్పకుండా ఉత్తీర్ణత సాధిస్తారని నమ్మకం వ్యక్తం చేశారు. వీరిని ఉపాధ్యాయులు దత్తత తీసుకోవాలని సూచించారు. గతేడాది కన్నా ఈసారి ముందుగానే మెటీరియల్ అందజేయడం జరిగిందని, ఇక వంద రోజుల యాక్షన్ ప్లాన్ పక్కాగా అమలు చేస్తామన్నారు. పాఠశాలకు సరిగా రాని విద్యార్థుల తల్లిదండ్రులతో ఉపాధ్యాయులు మాట్లాడి వారి ఉత్తీర్ణతకు గ్యారంటీ ఇచ్చి.. రెగ్యులర్‌గా పాఠశాలకు పంపేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. నూరు శాతం ఉత్తీర్ణతకు కలెక్టర్ మార్గదర్శనంలో ఉపాధ్యాయులు కృషిచేయాలని కోరారు.


విజేత గుంటూరు జిల్లా జట్టుతో జీవీ, తదితరులు

గెలుపోటములు సమానంగా తీసుకోవాలి

ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు

వినుకొండ, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): గెలుపోటములను సమానంగా తీసుకోవాలని ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు క్రీడాకారులకు సూచించారు. పట్టణంలోని జూనియర్ కళాశాల ఆవ రణలో జరుగుతున్న అంతర్ జిల్లాల కబడ్డీ పోటీలు సోమవారంతో ముగిశాయి. బాలికల విభాగంలో అనంతపురం జిల్లా జట్టు.. నెల్లూరు జిల్లా జట్టుపై ఫైనల్స్‌లో విజయం సాధించింది. బాలుర విభాగంలో గుంటూరు జట్టు.. కడప జట్టుపై గెలుపొందింది. ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు, లీలావతి దంపతులు, డీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు, కౌన్సిలర్ షకీలా దస్తగిరి పాల్గొని విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం చీఫ్ విప్ జీవీ మాట్లాడుతూ అండర్-19 కబడ్డీ పోటీలు వినుకొండలో జరగడం సంతోషంగా ఉందన్నారు. కబడ్డీ పోటీలను విజయవం తంగా నిర్వహించిన డీసీ చైర్మన్ గంగినేని రాఘవరావు, పరిశీలకు రాలు అజీరాబేగం, స్కూల్ గేమ్స్ సెక్రటరీ సురేష్‌కుమార్, డివిజన్ సెక్రటరీ రాధాకృష్ణ, చిరంజీవి, చినరామయ్య, జోన్ సెక్రటరీ వీరాంజనేయులు, ప్రెసిడెంట్ రాజేష్, ఎం.వెంకటేశ్వర్లు, వెంకటరత్నం, అంకారావు, వ్యాయామ ఉపాధ్యాయులను ఆయన శాలువాతో సత్కరించారు. జనసేన, టీడీపీ నాయకులు శ్రీనివాసరావు, రోశయ్య పాల్గొన్నారు.

సీసీఐ పత్తిబంధకాలు

ఎన్ని విజ్ఞప్తులు చేసినా..

ఏపీలో పత్తి రైతులను ఆదుకునేందుకు.. తేమ శాతంలో మార్పులు చేయాలని రాష్ట్ర వ్యవసాయ మంత్రి కేంద్రానికి లేఖ రాశారు. గత వారం గుంటూరు జిల్లాకు వచ్చిన కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు ఏపీ కాటన్ టీఎం సీ కన్సార్టియం ప్రతినిధులు ప్రత్యేకంగా వినతి పత్రం అందజేశారు. దీనిపై కేంద్రం నుంచి ఇప్పటి వరకు స్పందన రాలేదు.



కొనుగోలు కేంద్రాల్లో పాస్‌కాని పత్తి

- సీసీఐ నిబంధనలతో బయ్యర్ల తిరస్కరణ
- బయట దళారులకు రూ.5 వేలకే విక్రయం
- వాతావరణ మార్పులతో రైతుకు తప్పని కంట'తడి'
- తేమశాతం పెంచితేనే.. కర్షకులకు ప్రయోజనం

పత్తి రైతులకు సాగు మొదలకుని.. కొనుగోలు కేంద్రాల్లో పంట విక్రయం వరకు కంటతడి తప్పడం లేదు. సాగు సమయంలో పంటపై ప్రకృతి పగబడితే.. సీసీఐ(కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) నిబంధనలు మద్దతు ధర పొందడానికి ప్రతిబంధకాలుగా మారుతున్నాయి. తేమ శాతం అధికంగా ఉందని కొనుగులు కేంద్రాలకు వచ్చిన పత్తి పంటను బయ్యర్లు తిరస్కరిస్తున్నారు. దీంతో కేంద్రాలు ఆరంభించి అధికారికంగా పది రోజులు దాటినా ఉమ్మడి గుంటూరు జిల్లాలో పట్టుమని పది కేజీల పత్తి కూడా కొన్న దాఖలాలు కనిపించడం లేదు. సీసీఐ నిబంధనల మూలాన రైతులు కేంద్రాలకు తెస్తున్న పత్తి పాస్ అవ్వడం లేదు.

చిలకలూరిపేట, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో పత్తి తీత జోరుగా సాగుతోంది. మొన్నటి దాకా తుఫాన్ ప్రభావంతో పత్తిలో నెమ్ము ఎక్కువగా కనిపించింది. ఇప్పుడు వాతావరణం పూర్తిగా మారిపోయి పగటి వేళ కూడా చల్ల గాలులు వీస్తున్నాయి. ఇటువంటి పరిస్థితిలో రైతులు హడావిడిగా పత్తి తీయిస్తున్నా.. పంటలో తేమ శాతం 18 నుంచి 22 వరకు ఉన్నట్లు తేలుతోంది. సీసీఐ నిబంధనలు ప్రకారం తేమ శాతం 8 నుంచి 12 వరకు మాత్రమే ఉండాలి.

దళారుల పంట పండుతోంది..

పల్నాడు, గుంటూరు జిల్లాల్లో ఏర్పాటు చేసిన సీసీఐ కొనుగోలు కేంద్రాల వద్దే దళారుల పంట పండుతోంది. కేంద్రానికి తీసుకొచ్చిన పత్తిలో తేమ శాతం చూసిన తర్వాత (మిగతా 6వ పేజీలో)

ఏఎన్‌యూ ఫార్మసీ కళాశాలలో ఆటల పోటీలు



క్రీడా కారులతో ఫార్మసీ అధ్యాపకులు

ఏఎన్‌యూ, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సూచన మేరకు ప్రతి సంవత్సరం నేషనల్ ఫార్మసీ వీక్ సెలబ్రేషన్-ఫార్మసిస్ట్ యాజ్ ఎడ్వకేట్స్ ఆఫ్ వాక్సినేషన్ అనే థీమ్‌తో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో సోమవారం ఆటల పోటీలు ప్రారంభమయ్యాయి. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ దివ్య తేజోమూర్తి మాట్లాడుతూ క్రీడలు విద్యార్థులలో మానసిక ఉల్లాసాన్ని ఇస్తాయన్నారు. వారం రోజులపాటు ఈ పోటీలు జరగనున్నా యన్నారు. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్ డాక్టర్ షేక్.మస్తానమ్మ, స్పోర్ట్స్ కోఆర్డినేటర్ డాక్టర్ కె.విజయ్ కిషోర్, దివ్య భార్గవి, రేణుక పాల్గొన్నారు.

ఎమ్మెస్సీ యోగ పరీక్ష ఫలితాల విడుదల

ఏఎన్‌యూ నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ఈ ఏడాది జూలై, ఆగస్టులో నిర్వహించిన ఎమ్మెస్సీ యోగ నాలుగో సంవత్సరం ఫలితాలు సోమవారం విడుదలయ్యాయి. ఫలితాలను సీఈ ఆలపాటి శివప్రసాద్ రావు విడుదల చేశారు. రీవాల్యుయేషన్ పెట్టుకోదలచిన వారు ఒక్కొక్క పేపర్‌కు రూ.1860 చెల్లించి ఈ నెల 27 లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పరీక్ష ఫలితాలను ఏఎన్‌యూ వెబ్‌సైట్‌లో పొంది పరిచామని పేర్కొన్నారు.

సంక్రాంతి నుంచి ఎల్‌హెచ్‌బీ రైలుగా సర్కార్ ఎక్స్‌ప్రెస్

గుంటూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): దశాబ్దాల తరబడి కాకినాడ-చెంగల్‌పట్టు/పుదుచ్చేరి మధ్యన రాకపోకలు సాగిస్తోన్న సర్కారు ఎక్స్‌ప్రెస్ సంక్రాంతి పండగ రోజు నుంచి కొత్త రూపును సంతరించుకోబోతోంది. ఇప్పటివరకు ఐసీఎఫ్ బోగీలతో రాకపోకలు సాగిస్తోన్న ఈ రైలు ఇకపై కొత్త ఆధునిక ఎల్‌హెచ్‌బీ బోగీలతో ప్రయాణించనుంది. చెంగల్‌పట్టు నుంచి జనవరి 14వ తేదీన, పుదుచ్చేరి నుంచి జనవరి 15వ తేదీన ఈ రైలు ఎల్‌హెచ్‌బీ బోగీలతో ప్రయాణాన్ని ప్రారంభిస్తుంది.

మెరుగైన సేవలే ఏపీ గ్రామీణ బ్యాంకు లక్ష్యం

● చైర్మన్ కే ప్రమోద్‌కుమార్ రెడ్డి ● కర్లపాలెంలో నూతన కార్యాలయం ప్రారంభం



డ్వాక్రా మహిళలకు రూ.2కోట్ల చెక్కును అందజేస్తున్న ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ చైర్మన్ ప్రమోద్‌కుమార్ రెడ్డి

కర్లపాలెం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు రూ.128 వేల కోట్ల వ్యాపార లావాదేవీలు నిర్వహిస్తోందని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు చైర్మన్ కె.ప్రమోద్‌కుమార్ రెడ్డి అన్నారు. ఖాతాదారులకు మెరుగైన సేవలందించడమే తమ బ్యాంకు లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. కర్లపాలెంలో ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు నూతన కార్యాలయాన్ని జనరల్ మేనేజర్ బి.రామకృష్ణ, రీజనల్ మేనేజర్ చిరుమామిళ్ళ శ్రీనివాస్, ఆలిండియా యూనియన్ బ్యాంక్ పెన్షనర్స్ అసోసియేషన్ చైర్మన్ ఎంఎం.భాస్కర్‌రావుతో కలిసి సోమవారం ప్రమోద్‌కుమార్‌రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి బ్రాంచ్ మేనేజర్ ఆర్.అన్నరసన్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ప్రమోద్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ రాష్ట్రంలో 1,351 శాఖల ద్వారా ఖాతాదారులకు సేవలందిస్తోందన్నారు. ప్రభుత్వ రంగంలో ఆంధ్రప్రదేశ్ గ్రామీణబ్యాంక్ రాష్ట్రంలో రెండో అతిపెద్ద బ్యాంక్‌గా అవతరించిందన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు రంగ బ్యాంకులకు ధీటుగా ఆంధ్రప్రదేశ గ్రామీణబ్యాంక్ ఖాతాదారులకు మెరుగైన సేవలందిస్తోందన్నారు. అనంతరం మేనేజర్, సిబ్బంది రూమ్‌లను, లాకర్‌లను ప్రారంభించారు. డ్వాక్రా మహిళలకు రూ.2 కోట్ల చెక్కును అందజేశారు. కర్లపాలెం చైతన్యగ్రామీణా బ్యాంకు అభివృద్ధికి కృషి చేసిన విశ్రాంత మేనేజర్‌లు వెంకన్నచౌదరి, ఏసుపాదం, విద్యాసాగర్, మద్దుల సత్యనారాయణ, భవన యజమాని మంతెన సత్యనారాయణరాజును చైర్మన్ ప్రమోద్‌కుమార్‌రెడ్డి దుశ్శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ మేనేజర్ కెసాని మానసా, ఖాతాదారులు దుండి చలపతి రెడ్డి, పిట్టు మోహనరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విధ్వంసం నుంచి అభివృద్ధి వైపు: యరపతినేని



మాచవరంలో కుటుంబ న్యాయ సలహా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు తదితరులు

మాచవరం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఇటీవల విశాఖపట్నంలో జరిగిన ప్రపంచస్థాయి సీఐఐ సమ్మిట్ రాష్ట్ర అభివృద్ధికి దోహద పడుతుందని యరపతినేని శ్రీనివాసరావు అన్నారు. సోమవారం మాచవరం మండలంలోని పలు గ్రామాల్లో పలు కార్యాలయాల ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కొత్తపాలెం గ్రామంలో జమ్మిగుంపుల నాగేశ్వరరావు, వర్ధనమ్మలు సుమారు రూ.8 లక్షల సొంత నిధులతో నిర్మించిన కమ్యూనిటీ హాల్‌ను, మాచవరం గ్రామంలో మండల సమాఖ్య పరిధిలో జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు రజిని ఏర్పాటు చేసిన కుటుంబ న్యాయ సలహా కేంద్రాన్ని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యరపతినేని మాట్లాడుతూ, వైసీపీ పాలనలో ఆర్థికంగా దిగజారి పోయి విధ్వంస మయిన రాష్ట్రాన్ని సీఎం చంద్రబాబు అభివృద్ధి పట్టాలు ఎక్కిస్తున్నా రన్నారు. దీనిలో భాగంగానే విశాఖపట్నంలో జరిగిన సీఐఐ సమ్మిట్‌లో సుమారు రూ.14 లక్షల కోట్ల పెట్టుబడులు, ఇతర దేశాలతో ఒప్పందాలు కుదిరాయన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కష్టపడి పనిచేసే సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలను ఏకగ్రీవం అయ్యే విధంగా కృషి చేయాలన్నారు.

సీఐఐతో మారనున్న పెట్టుబడుల దిశ

● రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ గోనుగుంట్ల




సమావేశంలో మాట్లాడుతున్న గోనుగుంట్ల కోటేశ్వరరావు

నరసరావుపేట టౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ పెట్టుబడుల దిశను మార్చే చారిత్రాత్మక వేదికగా విశాఖ సీఐఐ సమ్మిట్ నిలిచిందని రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు అన్నారు. రాష్ట్రాన్ని పెట్టుబడుల హబ్‌గా మార్చేందుకు సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ వ్యూహాత్మకంగా చేసిన కృషికి ఈ సదస్సు ప్రతిఫలంగా నిలిచిందన్నారు. సోమవారం నరసరావుపేటలోని టీడీపీ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, పెట్టుబడులకు ఏపీని గమ్యస్థానంగా నిలపడంలో చంద్రబాబు నాయుడు మరోసారి తన ప్రావీణ్యాన్ని నిరూపించారని, రాయలసీమ, కోస్తాంధ్ర, ఉత్తరాంధ్ర ప్రాంతాలకు సమానంగా పెట్టుబడులు వచ్చేలా మంత్రి లోకేశ్ ప్రత్యేకంగా కంపెనీలను గైడ్ చేశారని చెప్పారు. ప్రతి రాష్ట్రం ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌ను అనుసరిస్తుంటే ఆంధ్రప్రదేశ్ అందుకు భిన్నంగా స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌ను అనుసరిస్తుండడంతో రాష్ట్రానికి పరిశ్రమలు క్యూ కట్టాయన్నారు. జగన్ మోహన్‌రెడ్డి విధ్వంసక విధానాలకు భయపడి రాష్ట్రం విడిచి వెళ్ళిపోయిన రెన్యూ, హీరో ఫ్యూచర్స్, ఏబీసీ వంటి కంపెనీలు తిరిగి రాష్ట్రానికి రావడం హర్షణీయమన్నారు. ఈ సమావేశంలో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొట్టా కిరణ్, ముండ్రుకోటి తదితరులు పాల్గొన్నారు.

ప్రకాశం బ్యారేజీ వద్ద స్వల్పంగా వరద ఉధృతి

● దిగువకు 400 క్యూసెక్కుల నీటి విడుదల



ప్రకాశం బ్యారేజీ దిగువకు విడుదలవుతున్న కృష్ణానది వరదనీరు

తాడేపల్లి టౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాజెక్టుల నుంచి నీటి విడుదల తగ్గించడంతో ప్రకాశం బ్యారేజి వద్ద కృష్ణానది వరద ఉధృతి స్వల్పంగా కొనసాగుతోంది. ఎగువన ఉన్న పులిచింతల ప్రాజెక్టు ప్రధాన వాగుల నుంచి 9,938 క్యూసెక్కుల వరద నీరు సోమవారం ఇన్‌ఫ్లోగా నమోదవుతుండగా 400 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్టు ఇరిగేషన్ జేఈ రాజేష్ తెలిపారు. బ్యారేజి రిజర్వాయర్‌లో 12 అడుగుల నీటి మట్టం కొనసాగుతుండగా తూర్పు డెల్టా కాలువకు 4,211 క్యూసెక్కులు, పశ్చిమ డెల్టాకు 5,101 క్యూసెక్కులు, గుంటూరు చానల్‌కు 226 క్యూసెక్కుల నీటిని వదులుతున్నట్టు జేఈ తెలిపారు.

సాగర్ నీటి సమాచారం

విజయపురిసౌత్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ జలాశయం నీటిమట్టం సోమవారం నాటికి 586.10 అడుగులు ఉంది. ఇది 300.83 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 10వేల క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 4,034 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బిసి ద్వారా 600 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లోగా 14,634 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు 14,634 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): పులిచింతల ప్రాజెక్టులో సోమవారం 42.22 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. ఎగువ నుంచి వెయ్యి క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు వచ్చి చేరుతుందని చెప్పారు. పవర్ జనరేషన్ ద్వారా 4 వేల క్యూసెక్కులు, లీకుల ద్వారా 400 క్యూసెక్కులు, మొత్తం 4,400 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు ఏఈ రాజు తెలిపారు.

ఏఎన్‌యూలో వేతనాల మాయాజాలం

● అతిథి అధ్యాపకుల జీతాల చెల్లింపులో గోల్‌మాల్ ● బ్యాంకు ఉద్యోగులను నిలదీసిన అధ్యాపకులు

ఏఎన్‌యూ, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఏఎన్‌యూలో పనిచేస్తున్న అతిథి అధ్యాపకుల్లో కొందరికి వేతనాలు జమ చేసి, మరికొందరికి జమ చేయకపోవడంపై విశ్వవిద్యాలయ ఉన్నతాధికారులు సీరియస్ అయ్యారు. వేతనాల చెల్లింపుకు సంబంధించిన నగదు చెక్కును ఓ అతిథి అధ్యాపకుడి చేతికి ఇవ్వటంపై ఉన్నతాధికారులు ఆరా తీశారు. విశ్వవిద్యాలయంలో పనిచేస్తున్న అతిథి అధ్యాపకులకు అక్టోబరు నెల వేతనాలు చెల్లించేందుకు సరిపడా నిధులు అకౌంట్‌లో లేకపోయినప్పటికీ ఓ అతిథి అధ్యాపకుడు అకౌంట్స్ విభాగం నుంచి కొంత నగదుతో కూడిన చెక్కును విశ్వవిద్యాలయంలోని యూనియన్ బ్యాంకుకు ఈ నెల 13న తీసుకెళ్లారు. అతిథి అధ్యాపకులందరి వేతనాలకు సరిపడా నిధులు అకౌంట్‌లో లేనప్పుడు జాబితాను తిరిగి అకౌంట్స్ విభాగానికి పంపాల్సిన యూనియన్ బ్యాంకు ఉద్యోగి ఆ అతిథి అధ్యాపకుడికి జాబితా ఇచ్చి ఎవరెవరికి వేతనాలు వేయాలో నిర్ధారించమన్నట్లు తెలిసింది. దీంతో అతను తనకు అనుకూలంగా ఉండే 30 మంది పేర్లను జాబితాలో చేర్చి ఇవ్వగా, వారందరి అకౌంట్లో బ్యాంకు సిబ్బంది ఈ నెల 13న వేతనాలు జమ చేశారు. మిగతా మెజారిటీ అతిథి అధ్యాపకులకు వేతనాలు సోమవారం మధ్యాహ్నం వరకు జమ కాలేదు. ఈ వేతనాల చెల్లింపు మాయాజాలం ఆలస్యంగా వెలుగులోకి రావడంతో సోమవారం అతిథి అధ్యాపకులు యూనియన్ బ్యాంకుకు వెళ్లి ముందుగా ఎంపిక చేసిన వారికి మాత్రమే ఏ నిబంధనల ప్రకారం వేతనాలు జమ చేశారని నిలదీశారు. ఓ అతిథి అధ్యాపకుడి మాట లను ఎలా పరిగణనలోకి తీసుకున్నారంటూ బ్యాంకు సిబ్బందితో పాటు బ్యాంకు మేనేజర్‌ను ప్రశ్నించారు. అనంతరం అకౌంట్స్ అధికారిని కలిసి కొంత మందికి మాత్రమే వేతనాల చెల్లింపుల చెక్కును ఎలా రాసి ఇచ్చారని ప్రశ్నించారు. చివరకు రెక్టార్ ఆచార్య శివరాంప్రసాద్‌తో పాటు రిజిస్ట్రార్ ఆచార్య సింహాచలంను కలిసి ఫిర్యాదు చేశారు. దీంతో రెక్టార్ శివరాం ప్రసాద్ ఫైనాన్స్ అధికారిని పిలిచి వేతనాలు జమకాని అతిథి అధ్యాపకులకు వెంటనే జమ చేయాలని ఆదేశించారు. ఉద్యోగులు బాధ్యతగా బ్యాంకులో అప్పజెప్పాల్సిన నగదు చెక్కును అతిథ్యాపకుడి చేతికి ఎలా ఇచ్చారని, ఇక ముందు అలా ఇవ్వొద్దని హెచ్చరించారు.



రుజువైన రైజింగ్ ఆంధ్రా సత్తా: చీఫ్ విప్ జీవీ

వినుకొండ, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): విశాఖ సీఐఐ సదస్సులో వెల్లువెత్తిన పెట్టుబడుల సునామీతో రైజింగ్ ఆంధ్రా సత్తా మరోసారి రుజువైందని ప్రభుత్వ చీఫ్‌విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. నవ్యాంధ్రప్రదేశ్ అభివృద్ధికి బలమైన బ్లూప్రింట్ ఇచ్చిన ఇలాంటి కార్యక్రమంపైన అయిదేళ్లలో పైసా తీసుకురాని వైసీపీ నాయకులు విషం కక్కడం విషాదకరమని మండిపడ్డారు. 12 ప్రధాన రంగాల్లో 13.5 లక్షల కోట్లకు పైగా పెట్టుబడి ఒప్పందాలు కుదరడం రాష్ట్ర చరిత్రలోనే ఆల్‌టైమ్ రికార్డని పేర్కొన్నారు. పెట్టుబడుల సదస్సుతో రాష్ట్ర ఆర్థిక జీవనాడిగా ఉన్న విశాఖకు బలమైన పునాది పడిందని, పెట్టుబడిదారుల విశ్వాసానికి నిలువెత్తు నిదర్శనం లక్షల కోట్ల పెట్టుబడులేనని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్ నేతృత్వంలో రాష్ట్రం సమగ్ర విధానాలతో ముందుకు సాగుతోందని స్పష్టం చేశారు. ఇదే వేగంతో కొనసాగితే ఏపీ దేశంలోనే పెట్టుబడులకు నంబర్ వన్ డెస్టినేషన్ అవుతుందన్నారు. ఉత్తరాంధ్ర, కోస్తా, రాయల సీమ ప్రాంతాల ప్రత్యేకతలకు అనుగుణంగా పరిశ్రమలు ఏర్పాటు చేసి సమతు ల అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు.

గంజాయి విక్రయిస్తున్న ఇద్దరి అరెస్టు

పెదకాకాని, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): గంజాయి కలిగి ఉన్న ఇరువురిని పెదకాకాని పోలీసులు సోమవారం అదుపులో తీసుకున్నారు. మండల పరిధిలోని వెనిగండ్ల గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు పెదకాకాని భ్రమరాంబపురం కాలనీలో గంజాయి విక్రయిస్తున్నారు. పోలీసులు పథకం ప్రకారం వారిని అదుపులో తీసుకున్నారు. వారి వద్ద నుంచి రెండు కేజీలు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో ర్యాపిడో రైడర్ దుర్మరణం

మంగళగిరి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి మండలం కురగల్లు వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ర్యాపిడో రైడర్ దుర్మరణం చెందాడు. మంగళగిరి పట్టణానికి చెందిన ఎ.మురళీ (33) ర్యాపిడో బైకు రైడర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ నేపథ్యంలో మురళీ తన ద్విచక్ర వాహనంపై సోమవారం కురగల్లు నుంచి నిడమర్రు వైపు వెళుతుండగా బైకు అదుపు తప్పి కిందపడిపోయాడు. అదే సమయంలో అటుగా వెళుతున్న టిప్పర్ మురళీ తలపై నుంచి వెళ్లడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎయిమ్స్ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు టిప్పర్ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పాముకాటుకు మహిళా కూలి మృతి

చిలకలూరిపేట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): పొలం పనులకు వెళ్లిన ఒక మహిళ పాముకాటుకు గురై మృతి చెందింది. ఈ ఘటన చిలకలూరిపేట మండలం గంగన్నపాలెం గ్రామంలో సోమవారం జరిగింది. గ్రామానికి చెందిన జటావతు ప్రియంతి బాయి (26) పత్తి తీత పనికి వెళ్ళింది. పొలంలో పని చేస్తుండగా ఆమె ఎడమ కాలుకు రక్తపింజర కాటు వేసింది. తోటి కూలీలు గమనించి ఆమెను చికిత్స నిమిత్తం చిలకలూరిపేటలోని ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే ప్రియంతి బాయి మృతి చెందింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిలకలూరిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. భర్త గణేష్ నాయక్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చినఅగ్రహారంలో మరో వ్యక్తి

పిడుగురాళ్ల: మండలంలోని చినఅగ్రహారం గ్రామానికి చెందిన ఆవుల సాంబశివరావు (42) ఆదివారం గడ్డివాము దగ్గరకు వెళ్లగా పాము కరిచి మృతి చెందాడు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

మాదక ద్రవ్యాలపై పోరుకు సంకల్పం

● నేడు విట్ వర్సిటీలో కార్యక్రమం ప్రారంభం ● ఎస్పీ వకుల్ జిందాల్

గుంటూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మాదక ద్రవ్యాలపై పోరుకు సంకల్పించామని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ స్పష్టం చేశారు. ఈ మేరకు సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, జిల్లాలో మాదక ద్రవ్యాల దుర్వినియోగాన్ని అరికట్టేందుకు "సంకల్పం" అనే ప్రత్యేక కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు వెల్లడించారు. దీనిలో భాగంగా తొలుత జిల్లాలోని అన్ని కళాశాలల్లో విద్యార్థులకు మాదక ద్రవ్యాల వినియోగంతో దుష్ప్రభావాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఆ తరువాత విద్యార్థుల తల్లిదండ్రులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. దీనిలో భాగంగా మంగళవారం విట్ యూనివర్సిటీ ప్రాంగణంలో గుంటూరు జిల్లా పోలీస్, విట్ యూనివర్సిటీ సంయుక్త ఆధ్వర్యంలో "సంకల్పం" కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు ఎస్పీ తెలిపారు. ఇప్పటికే జిల్లావ్యాప్తంగా అన్ని కాలేజీల్లో విద్యార్థులతో కలిపి ఈగల్ టీమ్స్‌ను ఏర్పాటు చేసి, పలు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామని చెప్పారు. తాము ప్రారంభిస్తున్న సంకల్పం కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని ఎస్పీ కోరారు.

సీసీఐ పత్తిబంధకాలు!

(5వ పేజీ తరువాయి)

బయ్యర్లు తిరస్కరిస్తున్నారు. దీంతో బయట అదే పత్తిని దళారులు అతి తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారు. పంటను వెనక్కి తీసుకెళ్తే.. రవాణా ఖర్చులు తడిసి మోపెడు అవుతాయని భావించిన రైతులు.. అయినకాడికి పత్తిని అక్కడే తెగ నమ్ముకుంటున్నారు. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో క్వింటాల్ పత్తి రూ.5 వేలకు అధికంగా కొనుగోలు చేసే పరిస్థితి లేదు. అదే పత్తి సీసీఐ కొనుగోలు చేస్తే రైతుకు క్వింటాల్ కు రూ.రూ.8,110 (మొదటి శ్రేణి నాణ్యత) లభిస్తుంది. దిగువ శ్రేణి నాణ్యత కలిగిన పత్తికి రూ.7,710 వరకు మద్దతు ధర దక్కేది.

జీవోను అమలు చేయడం లేదు..

రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీవో నంబరు 843 ను సీసీఐ మేనేజర్ రాజేంద్ర షా అమలు చేయడం లేదని ఆరోపిస్తూ ఏపీ కాటన్ టీఎం సీ కన్సార్టియం రాష్ట్ర అధ్యక్షుడు ఇక్కుర్తి శివప్రసాద్ సీఎండీకి లేఖ రాశారు. జీవోలోని 23వ నిబంధన ప్రకారం రైతుల పత్తి పంటను ఇష్టం అయిన చోట అమ్ముకునే అవకాశం ఉంది. సీసీఐ మాత్రం తాము చెప్పిన చోటే అమ్ముకోవాలని చెబుతోంది. దీనిపై ఏపీ కాటన్ టీఎం సీ కన్సార్టియం ప్రతినిధులు సీసీఐ మేనేజర్‌ను కలిసి రైతుల సౌలభ్యం కోసం జీవోను అమలు చేయాలని కోరినా.. పెద్దగా స్పందించకపోవడంతో తో సీఎండీకి ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.6.40 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	122, 132, 142
చికెన్ విత్ స్కిన్(కిలో)	230.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	240.00

37,951 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు సోమవారం 39,942 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 37,951 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 9,689 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	10000	17600
నెంబరు. 5	10000	16000
273	----	----
341	10000	17200
4884	----	----
సూపర్ 10	----	----
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	10000	16000
షార్క్-1	-----	----
బ్యాడిగి	11000	18000
దేవనూరు డీలక్స్	10500	17000

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
ఆర్మూరు	10000	13500
ఏసీ కామన్ వెరైటీ		
334	10500	17000
నెంబరు. 5	10000	16500
341	10500	18000
4884	11000	14500
సూపర్ 10	----	----
ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	10000	15500
బ్యాడిగి	10000	18500
దేవనూరు డీలక్స్	10500	17500
తాలుకాయలు	5000	9000

పల్నాడు వార్తలు

మాచర్ల ◆ గురజాల ◆ సత్తెనపల్లి ◆ పెదకూరపాడు

ఇంటి స్థలాలు ఉన్న వారికి గృహాల మంజూరు

రెంటచింతల, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): ఇంటిస్థలాలున్న వారికి పక్కా గృహాలను మంజూరుచేస్తామని హౌసింగ్ ఏఈ శ్రీనివాసరావు చెప్పారు. సోమవారం విలేకరులతో మాట్లాడుతూ సెంటున్నర స్థలం ఉన్న పేదల భార్యభర్తల ఆధార్, బ్యాంక్ ఎకౌంట్, రేషన్‌కార్డు జిరాక్స్, ఆదాయ, నివాస, కులధృవ పత్రాలను ఇవ్వాలన్నారు. ఈనెల 30లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇప్పటికి 754 దరఖాస్తులొచ్చాయన్నారు. పీఎంఏవై 2.0 పథకం కింద గ్రామీణప్రాంతాల్లో రూ.1.80లక్షలు ఇవ్వనున్నట్లు చెప్పారు.

తల్లిదండ్రుల పోషణ బాధ్యత పిల్లలదే

● మండల న్యాయ సేవా కమిటీ చైర్మన్ శ్రీనివాస్ కల్యాణ్

మాచర్ల రూరల్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): వృద్ధాప్యంలో తల్లిదండ్రులను పోషించాల్సిన బాధ్యత పిల్లలదేనని మండల న్యాయ సేవా కమిటీ చైర్మన్, న్యాయాధికారి శ్రీనివాస్ కల్యాణ్ పేర్కొన్నారు. మండలంలోని రాయవరంలో సోమవారం నిర్వహించిన న్యాయ విజ్ఞానసదస్సులో ఆయన మాట్లాడారు. ఎందరో వృద్ధులు తమ పిల్లల నిరాదరణకు గురవుతూ మానసింగా ఆవేదన చెందుతున్నారన్నారు. తల్లిదండ్రులు, వయో వృద్ధుల పోషణ సంక్షేమ చట్టం-2007 గురించి అవగాహన కల్పించారు. అదనపు జూనియర్ సివిల్ జడ్జి ప్రశాంత్, ఎంపీడీవో ఫణికుమార్, ఎస్ఐ సంధ్యారాణి, సర్పంచ్ వెంకట్‌కుమారి పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

సత్తెనపల్లి, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): ఈనెల 15, 16 తేదీల్లో హైదరాబాద్ గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో జరిగిన తొమ్మిది రాష్ట్రాల కరాటే పోటీల్లో సత్తెనపల్లి విద్యార్థులు పాల్గొని ప్రతిభ చూపారు. పదిమంది విద్యార్థులకు గాను తొమ్మిది మంది విద్యార్థులు మెడల్స్ సాధించారని కరాటే శిక్షకులు అనుమల రామయ్య, రాంబాలు సోమవారం విలేకరులకు తెలిపారు. సబ్ జూనియర్ కటా విభాగంలో పీ టిషంత్, విష్ణు, కిరీట్, బాలాజీ, తేజు ప్రకాష్, అక్షయరెడ్డిలు గోల్డ్ మెడల్ సాధించారని, జీ సత్యనారాయణ సిల్వర్ మెడల్ సాధించారని తెలిపారు.

గోశాలకు ఆవుల తరలింపు

పట్టణంలోని రహదారులపై సంచరిస్తూ ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్న 20 ఆవులను సోమవారం గోశాలకు తరలించినట్టు మునిసిపల్ కమిషనర్ ఆనంద్‌కుమార్ తెలిపారు. ఈనెల 20వ తేదీలోపు ఒక్కో ఆవుకు రూ.300 జరిమానా చెల్లించి విడిపించుకెళ్లాలని యజమానులకు ఆయన సూచించారు. లేకపోతే ఆవుల యజమానులపై చర్యలు తీసుకుంటామన్నారు.

మాదలలో సహకార వారోత్సవాలు

ముప్పాళ్ళ, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): సహకార సంఘాలు ప్రజలను ఆర్థికంగా బలోపేతం చేస్తాయని మాదల పీఏసీఎస్ చైర్మన్ చిమటా పోలురాజు అన్నారు. అంతర్జాతీయ సహకార వారోత్సవాలు మాదల పీఏసీఎస్ వద్ద సోమవారం ఘనంగా నిర్వహించారు. సంఘ చైర్‌పర్సన్ పోలురాజు సహకార జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ రిజిస్ట్రార్ టి.రజని, ఎస్.ఎల్.డి.సి.ఓ కె.అంజమ్మ, సంఘ డైరెక్టర్ బి.లక్ష్మణరావు రావిపాటి నానయ్య, రావిపాటి కోటయ్య, మార్పుల వెంకటరెడ్డి, బ్యాంకు మేనేజర్ పాల్గొన్నారు.

లింగాకర్షక బుట్టల పంపిణీ

ప్రకృతి వ్యవసాయం చేసే రైతులకు మిరప, మొక్కజొన్న పంటలో వేయటానికి లింగాకర్షక బుట్టలు, పసుపు బునుగు అట్టల కిట్లను ఎస్ఎఫ్ఏ నందకుమార్ సోమవారం పంపిణీచేశారు. మండలంలోని నార్నెపాడులో ఎస్2ఎస్, ఆర్‌డీఎస్ కిట్లు అంతర పంటలసాగులో లింగాకర్ష బుట్టలు, పసుపు బునుగు అట్టలతో పాటు మినుము, పెసర, అలసంద, ఆకుకూరలు, దుంప, తీగ జాతికిట్లు రైతులకు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో డివిజన్ ఇన్‌ఛార్జి మధుబాబు, యూనిట్ ఇన్‌ఛార్జి పూజ పాల్గొన్నారు.

కొమెరపూడి వాసికి డాక్టరేట్

సత్తెనపల్లి రూరల్: మండలంలోని కొమెరపూడి గ్రామానికి చెందిన దివ్వెల సత్యనారాయణకు డాక్టరేట్ లభించింది. ఆయన ప్రకాశం జిల్లా మార్కాపురం పట్టణంలోని కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో ఈసీఈ విభాగాధిపతిగా పని చేస్తున్నారు. ఈ విభాగంలో బోధన, పర్యవేక్షణ, ప్రాజెక్టు మార్గదర్శనం, ప్రయోగశాల అభివృద్ధి వంటి రంగాల్లో నిరంతరం నాణ్యతను చూపుతూ పని చేశారు. విద్యార్థుల్లో పరిశోధనా శక్తిని పెంచటంలో ఆయన చేసిన కృషి, నిర్వహణను గుర్తించిన జేఎస్ యూనివర్సిటీ(ఫిరోదాబాద్) ప్రతినిధుల నుంచి సోమవారం డాక్టరేట్‌ను పొందారు.

అదనపు తరగతి గదులకు భూమి పూజ

అచ్చంపేట, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదపాలెం ఎంపీయూపీ స్కూల్‌కు రూ.15లక్షల సర్వశిక్ష అభియాన్ నిధులతో అదనపు తరగతి గదులతో పాటు ప్రహరీ గోడ నిర్మాణానికి సోమవారం టీడీపీ నాయకులు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు నందిగం ఆశీర్వాదం, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి పాటిబండ్ల బాపిరాజు, వెనిగండ్ల కోటయ్య, నల్లమోతు హరిబాబు, నెల్లూరి వెంకటయ్య, బత్తుల శ్రీనివాసరావు, యడ్లపల్లి బుచ్చిబాబు, నెల్లూరి శ్రీను, బుర్రి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

విఘ్నేశ్వరస్వామి దేవస్థాన చైర్మన్ సాంబశివరావు మృతి

అమరావతి, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): ధరణికోట విఘ్నేశ్వరస్వామి దేవస్థాన వ్యవస్థాపక అధ్యక్షుడు, ఆర్‌వీవీఎన్ కళాశాల కార్యదర్శి దండా సాంబశివరావు(75) సోమవారం గుండెపోటుతో మృతి చెందారు. కార్డియక్ అరెస్టుతో మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. సాంబశివరావు మృతికి పలువురు ప్రముఖులు సంతాపం తెలిపారు. సాంబశివరావుకు భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

అన్నదానం పవిత్ర కార్యం

శుభకార్యాలలో మిగిలిన ఆహారాన్ని నిరుపేదలకు పంపిణీ చేయడం ద్వారా వారి ఆకలి తీరుతుందని జిల్లా తెలుగురైతు కార్యనిర్వాహక కార్యదర్శి పి.పూర్ణచంద్రరరావు అన్నారు. కార్తీక మాసం సందర్భంగా పెదకూరపాడు అంకమ్మ దేవాలయంలో జరిగిన వనభోజనాలలో మిగిలిపోయిన ఆహార పదార్థాలను జనచైతన్య సమితి నిర్వాహకులు సేకరించి వాటిని అమరావతిలోని యానాది కాలనీ, 75 తాళ్ళూరు శాంతి కాలనీలో పంపిణీ చేశారు. కార్యక్రమంలో సమితి నిర్వాహకులు టి.సాంబశివరావు, బి.నాగేశ్వరరావు, అశోక్, అన్వర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల చదువు అర్ధంతరంగా ఆగిపోకూడదు

మాచర్ల, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): ఆర్థిక, మౌలిక వసతులు లేక విద్యార్థుల చదువు ఆగిపోకూడదని బిగ్ ఫర్ ఎడ్యుకేషన్ ఫౌండర్ షేక్ చాంద్‌పాషా అన్నారు. సోమవారం పట్టణ ఎస్టీ కాలనీలోగల ఎంపీపీఎస్ పాఠశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన మినీ డైనింగ్‌హాలును ఆయన ప్రారంభించి మాట్లాడారు. బిగ్ హెల్ప్ ద్వారా పాఠశాలల్లో వసతుల కల్పనకు కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంఈవోలు కోటేశ్వరరావు, సురేష్, హెచ్ఎం ప్రసాద్, సంస్థ కోఆర్డినేటర్ జె గంగాధరబాబు, తాటి రాజశేఖర్, బీఎం శాస్త్రి, చిన్ని, ప్రకాష్, నీలిమా పాల్గొన్నారు.

రేపు బహిరంగ వేలం

మాచర్ల రూరల్: మండలంలోని ఎత్తిపోతలలో ఉన్న శ్రీరంగనాథస్వామి ఆలయంలో దత్తజయంతి, తొలిఏకాదశి పర్వదినం సందర్భంగా కొబ్బరికాయలు, పూజాద్రవ్యాలు, కూల్‌డ్రింక్ విక్రయహక్కునకు ఈనెల 19వ తేదీన పట్టణంలోని శ్రీలక్ష్మి చెన్నకేశవస్వామి ఆలయంలో బహిరంగవేలం నిర్వహించనున్నారు. 01-12-2025 నుంచి 30-11-2026 తేదీవరకు హక్కు వర్తించనుంది.

భార్య అరిచిందని ఇంట్లోంచి వెళ్లిపోయిన భర్త

గురజాలటౌన్: భార్య అరిచిందని భర్త ఇంట్లోంచి వెళ్లిపోయిన సంఘటన మండలంలోని చర్లగుడిపాడులో జరిగింది. పోలీసుల కథనం మేరకు.. చర్లగుడిపాడు గ్రామానికి చెందిన ఐనాల పెద్ద సుబ్బారావు కుటుంబ కలహాల నేపథ్యంలో ఈనెల 6వ తేదీన భార్య అరిచిందని ఇంట్లోంచి వెళ్లిపోయాడు. గురజాల పోలీసు స్టేషన్లో భార్య ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వినోద్‌కుమార్ తెలిపారు.

గురజాల నియోజకవర్గం నా కుటుంబం

● గురజాల ప్రజలతో మమేకమైపోయాను

● ఎమ్మెల్యే యరపతినేని



కేశానుపల్లిలో కస్తూర్బా పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యరపతినేని, పక్కన ఆర్డీవో మురళీకృష్ణ తదితరులు

దాచేపల్లి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): గురజాల నియోజకవర్గం నా కుటుంబం.. ఇక్కడి ప్రజలు నా కుటుంబసభ్యులే.. ఎమ్మెల్యేగా ఉన్నా లేకున్నా ఈ ప్రాంత ప్రజలు నన్ను ఎమ్మెల్యేగానే ఆదరించారు.. ఈ ప్రాంత అభివృద్ధే నా ఉక్కు సంకల్పం.. గురజాల నియోజకవర్గంను ఆదర్శంగా మార్చి చూపుతా.. బయటి వ్యక్తులు నియోజకవర్గంలోకి వచ్చి హత్యలు చేసి ఫ్యాక్షనిజాన్ని పెంచిపోషించి కోట్లు సంపాదించి షాపింగ్ కాంప్లెక్స్‌లు నిర్మించుకున్నారు.. ఫ్యాక్షన్ రూపుమాపడం.. గురజాల నియోజకవర్గంను అభివృద్ధి చేయడమే తన లక్ష్యమని ఎమ్మెల్యే యరపతినేని అన్నారు. సోమవారం దాచేపల్లి నగర పంచాయతీ నారాయణపురంలోని టీడీపీ కార్యాలయంలో కార్యకర్తలతో ఆత్మీయ సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. పార్టీలతో సంబంధం లేకుండా పేదలకు ప్రభుత్వం నుంచి ప్రతి సాయాన్ని అందిస్తామని ఆయన స్పష్టం చేశారు. పల్నాడులో ఫ్యాక్షనిజాన్ని కంట్రోల్ చేశాం.. మేం శాంతియుతంగా ఉన్నామని ప్రతిపక్షాలు రెచ్చిపోతే చూస్తూ ఊరుకోమంటూ హెచ్చరించారు. విశాఖలో జరిగిన పారిశ్రామికవేత్తల సమావేశంలో రాష్ట్రానికి పెట్టుబడులు వెల్లువలా వస్తున్నాయన్నారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్ ఆధ్వర్యాన రాష్ట్రం అభివృద్ధి పథంలో నడుస్తుందన్నారు. పేదలను ఆదుకోవడంలో, బడుగు, బలహీనవర్గాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ముందుంటుందన్నారు. కార్యక్రమంలో తంగెళ్ల శ్రీను, నర్రా పుల్లయ్య, బొమ్మిరెడ్డి నారాయణ, షేక్ అహ్మద, బెల్లంకొండ భారతి బద్రి, మునగా నిమ్మయ్య, సొసైటీ నారాయణ, వేముల వినోద్‌రెడ్డి, పురంశెట్టి పరంజ్యోతి, వేముల కిరణ్‌కుమార్, పగడాల భాస్కరరావు, అక్కినపల్లి బాలయ్య, కోట వెంకటేశ్వర్లు, ఎండూరి రామకోటయ్య, ఎంపీటీసీ వలి, సాయన్న తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి దశ నుంచే ఉన్నతాశయాలు ఉండాలి

విద్యార్థులు చిన్న తనం నుంచే ఉన్నతమైన ఆశయాలు కలిగి ఉండాలని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అన్నారు. సోమవారం మండలంలోని ఆదర్శపాఠశాల, కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల, మహాత్మా జ్యోతిరావు పూలే వెనుకబడిన తరగతుల పాఠశాలలను ఆర్డీవో మురళీకృష్ణతో కలిసి సందర్శించారు. తొలుత ఆదర్శ పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులను కలిసి మాట్లాడారు. మోడల్ స్కూల్‌లో అదనపు తరగతి గదులు, ఆర్వో ప్లాంట్‌కు రూ.28లక్షల నిధులను మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం కేశానుపల్లిలో కేజీబీవీలో ఉపాధ్యాయులు, విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రికార్డులను పరిశీలించారు. పాఠశాలలో మౌలికవసతులు, ఉన్నత పాఠశాలకు రెండు ఎకరాల స్థలం మంజూరుకు ఎమ్మెల్యే ఆదేశాలు జారీ చేశారు. అనంతరం మహాత్మా జ్యోతిరావుపూలే పాఠశాలను సందర్శించారు. పాఠశాలలో పక్కా భవనాల నిర్మానానికి ఐదెకరాల స్థలాన్ని మంజూరుచేసినట్లు ఎమ్మెల్యే పాఠశాలలో ఏర్పాటుచేసిన సభలో ప్రకటించారు. ఆయా కార్యక్రమాల్లో తహసీల్దార్ శ్రీనివాస్ యాదవ్, కమిషనర్ వెంకటేశ్వర్లు, ఎంపీడీవో వెంకటేశ్వర్లు, ఎంఈవో పినాకపాణి, ఆర్‌డబ్ల్యూఎస్ సోమయ్య, ఇరిగేషన్ డీఈ ఆదినారాయణ, ప్రిన్సిపాల్స్ పరమేశ్వరరావు, తోట అరుణ, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ రామారావు పాల్గొన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న డాక్టర్ మాధవీలత

పీహెచ్‌సీ తనిఖీ

కారంపూడి, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): కారంపూడిలోని పీహెచ్‌సీని సోమవారం జిల్లా లెప్రసీ, టీబీ కంట్రోల్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ మాధవీలత తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. సచివాలయం-2 పరిధిలో వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైద్యాధికారిణి లక్ష్మీ, హెల్త్ సూపర్‌వైజర్ మల్లయ్య, మస్తాన్‌వలి, ఎం లాలునాయక్, ఏఎన్ఎం ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శల తిరునాళ్ళ

అచ్చంపేట: మండలంలోని నీలేశ్వరపాలెం అటవీప్రాంతంలో నీలకంఠేశ్వరస్వామి తిరునాళ్ళ మహోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. కార్తీకమాసం సందర్భంగాదేవస్థానంలో శల తిరునాళ్ళకు మండలవ్యాప్తంగా భక్తులు విచ్చేశారు. భక్తులు స్వామివారికి పొంగళ్లు సమర్పించారు.

నాగమ్మ గుడి ఫెన్సింగ్ నిర్మాణానికి భూమి పూజ



భూమిపూజ చేస్తున్న జంగా కృష్ణమూర్తి

దాచేపల్లి, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): పల్నాటి నాయకురాలు నాగమ్మచే నిర్మించిన శ్రీచెన్నమల్లికార్జునస్వామి ఆలయానికి ఫెన్సింగ్ నిర్మాణానికి టీటీడీ బోర్డు సభ్యుడు జంగా కృష్ణమూర్తి సోమవారం భూమిపూజ చేశారు. గామాలపాడులో నాగులేరు ఒడ్డున 11వ శతాబ్దంలో నాయకురాలు నాగమ్మచే నిర్మించబడిన చెన్న మల్లికార్జునస్వామి ఆలయ ప్రహరీ నిర్మాణంలో భాగంగా శ్రీసిమెంట్ ఫ్యాక్టరీ సహకారంతో ఫెన్సింగ్ నిర్మాణం చేపట్టారు. కార్యక్రమంలో పిడుగురాళ్ళ జెడ్పీటీసీ జంగా వెంకటకోటయ్య, సర్పంచ్ జంగా సురేష్, శ్రీసిమెంట్ పర్సనల్ డిపార్ట్‌మెంట్ జీఎం శ్రీనివాసు, ఏజీఎం లక్ష్మీనారాయణ, నర్రా పుల్లయ్య, మునగ నిమ్మయ్య, భూషణం చిన్నయ్య, మాచెట్టి పుల్లారావు, గద్దల వేదమణి తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలి

● పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణారావు



సమావేశంలో మాట్లాడుతున్న రామకృష్ణారావు

మాచర్ల, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలని పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణారావు కోరారు. సోమవారం పట్టణంలోని పెన్షనర్స్ అసోసియేషన్ హాలులో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల జేఏసీతో జరిగిన సమావేశాల్లో పెన్షనర్లకు క్వాంటం ఆఫ్ పెన్షన్‌ను సరిచేసి పూర్వం లాగా పెన్షనర్లకు లబ్ధి చేకూరేలా ఉత్తర్వులు జారీ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. సమావేశంలో అసోసియేషన్ అధ్యక్షుడు మర్రెడ్డి, వెంకటరెడ్డి, చంద్రయ్య, గౌస్, గాలీబు, ఈశ్వరయ్య, నాగిరెడ్డి, కిరీటిరెడ్డి, హేమలత, మాబు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కార్తిక సోమవారం పూజలు



రెంటచింతల: అమరలింగేశ్వరస్వామి ఆలయం వద్ద భక్తులు



క్రోసూరు శివాలయంలో ఉసిరి చెట్టు వద్ద దీపారాధనలు చేస్తున్న మహిళలు

గురజాలటౌన్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని దైదలో ఉన్న శ్రీఅమరలింగేశ్వర స్వామి దేవస్థానానికి సోమవారం భక్తులు పోటెత్తారు. కార్తీక మాసం చివరి సోమవారం కావడంతో దేవస్థానానికి భక్తులు తెల్లవారుజాము నుంచే పోటెత్తారు. కృష్ణానదిలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి దీపారాధన చేసి బిలంలోని స్వామిని దర్శించుకున్నారు. దేవస్థానం దగ్గర భక్తులకు ఈవో పూర్ణచంద్రరావు అన్ని సౌకర్యాలను కల్పించారు. సుమారు 8 వేల మంది భక్తులు సందర్శించినట్లు ఈవో తెలిపారు. సీఐ భాస్కర్, ఎస్ఐ వినోద్‌కుమార్ బందోబస్తు నిర్వహించారు.

కృష్ణానది తీరాన భక్త జనసందడి

రెంటచింతల: సత్రశాల భక్తజనంతో పోటెత్తింది. కార్తీక మాసం చివరి సోమవారం కావడంతో భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి చేరుకున్నారు.సూర్యోదయానికి ముందుగానే స్నానమాచరించి శ్రీగంగాభ్రమరాంబ సమేత మల్లిఖార్జున స్వామి దర్శనానికి బారులు తీరారు. గోలి గ్రామ సర్పంచ్ ఎం.చంద్రంనాయుడు, ప్రభావతి, మిరియాల సుబ్బారావు, స్రవంతిలు 2600 మందికి అన్నదానం చేసినట్లు ఎండోమెంట్ ఈవో గాదె రామిరెడ్డి, ట్రస్ట్‌బోర్డు చైర్మన్ జీవీ శివయ్యలు చెప్పారు. రెంటచింతల గ్రామంలోని అయ్యప్ప కల్యాణమండపంలో వినుకొండ గురవారెడ్డి, పాలువాయి కొండలు 250 మందికి అన్నదానం చేసినట్లు నిర్వాహకులు పల్లెర్ల లక్ష్మారెడ్డి, వెన్నా వెంకటేశ్వరరెడ్డిలు పేర్కొన్నారు.

● మాచవరం: మండలంలోని అన్ని గ్రామాల్లో సోమవారం కార్తీకమాస పూజలు ఘనంగా నిర్వహించారు. మహిళలు ఆయా గ్రామాల శివాలయాల్లో దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మోర్జంపాడు శివారు బుగ్గమల్లేశ్వరస్వామి దేవాలయానికి భక్తులు అధిక సంఖ్యలో వెళ్ళి పూజలు చేశారు.

● నకరికల్లు: కార్తీక సోమవారాన్ని పురస్కరించుకొని చేజర్ల కపోతేశ్వరస్వామి దేవాలయంలో, నరసింగపాడులోని అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వర స్వామి దేవాలయం, గంగా అన్నపూర్ణ సమేత మరకతలింగ చంద్రమౌళేశ్వరస్వామి దేవాలయం, గుండ్లపల్లిలోని మల్లేశ్వరస్వామి దేవాలయం, కుంకలగుంటలోని భద్రకాళి సమేత ఉత్కంఠ వీరభద్రస్వామి దేవాలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. చేజర్లలో కపోతేశ్వరాలయంలో దశ సహస్ర లింగం వద్ద, ధ్వజ స్తంభం వద్ద, శివలింగాల వద్ద కార్తీక దీపాలు వెలిగించి పూజలు చేశారు. కుంకలగుంటలోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో స్వామివారికి విశేషాభిషేకాలు, పూజలు చేశారు.

● క్రోసూరు: కార్తికమాస చివరి సోమవారం క్రోసూరు మండలంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా క్రోసూరులోని విశ్వేశ్వర స్వామి దేవాలయంలో తెల్లవారుజాము నుంచే వందల సంఖ్యలో భక్తులు బారులు తీరారు. మారేడు, ఉసిరి చెట్టు వద్ద పూజలు నిర్వహించారు. ఉయ్యందన శివాలయంలో ప్రమిదలతో శివలింగాకారాన్ని ఏర్పాటుచేశారు. దొడ్లేరు భీమలింగేశ్వర స్వామి, 88తాళ్ళూరు మల్లిఖార్జునస్వామి, పీసపాడు, అందుకూరు, ఉయ్యందన, బయ్యావరం, ఊటుకూరు, విప్పర్ల గ్రామాల్లో శివాలయాలు ఓంకార నాదంతో మారుమోగాయి.

● బెల్లంకొండ: బెల్లంకొండ శివాలయంలో సోమవారం కార్తీక సోమవారం వైభవంగా నిర్వహించారు. భారీగా వచ్చిన మహిళలు ప్రత్యేక పూజా కార్యక్రమం నిర్వహించారు. భక్తులకు దేవదాయ శాఖ అధికారి కోటిరెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

● పెదకూరపాడు: మండలంలోని పలు దేవాలయాల్లో కార్తీక మాసాన్ని పురస్కరించుకొని సోమవారం ప్రత్యేక పూజలను నిర్వహించారు. పెదకూరపాడులోని శివాలయం, నాగమల్లేశ్వర స్వామి దేవాలయం, 75తాళ్ళూరులోని శివాలయం, సాయి బాబా దేవాలయం ఉదయం నుంచే మహిళలు అధిక సంఖ్యలో పూజల్లో పాల్గొన్నారు.

గ్రంథాలయాలు సామాజిక విద్యా కేంద్రాలు

పిడుగురాళ్ల, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా సోమవారం పిడుగురాళ్ల శాఖ గ్రంథాలయంలో పుస్తకపఠనం ప్రాముఖ్యతను గ్రంథాలయ అధికారి రాజశేఖర్ విద్యార్థులకు, పుస్తక ప్రియులకు వివరించారు. పాఠశాల స్థాయి నుండే పుస్తక పఠనం ఆవశ్యకతను గుర్తిస్తే భవిష్యత్‌లో మంచి ఫలితాలను సాధించవచ్చన్నారు.

● క్రోసూరు: గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా సోమవారం క్రోసూరు శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు క్విజ్, పద్య పోటీలు నిర్వహించారు. స్థానిక ఎలిమెంటరీ స్కూల్ హెచ్ఎం జీ పద్మావతి క్విజ్ మాస్టర్‌గా వ్యవహరించారు. వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. గ్రంథాలయ అధికారి వీరాంజమ్మ పాల్గొన్నారు.

● పెదకూరపాడు: పెదకూరపాడు శాఖా గ్రంథాలయంలో సోమవారం గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ గుడిపూడి రాజు, జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం కాకాణి వెంకటరమణ, దర్శి శేషారావు పాల్గొన్నారు.

● రెంటచింతల: విద్యార్థులు పుస్తక పఠనం చేస్తే మనో వికాసం పొందవచ్చని రెంటచింతల గ్రంథాలయాధికారి రాయపాటి రాజకిషోర్ అన్నారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా సోమవారం డ్రాయింగ్ పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో ఎల్‌జీహెచ్ హెచ్ఎం.భారతి, సిబ్బంది పాల్గొన్నారు.

● దుర్గి: గ్రంథాలయాలు సామాజిక విద్యా కేంద్రాలని గ్రంథాలయాధికారి పులిబండ్ల వేణుగోపి అన్నారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకొని సోమవారం స్థానిక గ్రంథాలయంలో ప్రతి ఆదివారం విద్యార్థులు గ్రంథాలయానికి రావాలి అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

నాయీ బ్రాహ్మణుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

● కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ మద్దిరాల గంగాధర్

క్రోసూరు, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ, మునిసిపాలిటీ, కార్పోరేషన్‌ల పరిధిలోని షాపింగ్ కాంప్లెక్స్‌లలో నాయీ బ్రాహ్మణులకు ప్రత్యేకంగా షాపుల కేటాయించాలని ప్రభుత్వం నిర్ణయించటం నాయీ బ్రాహ్మణుల సంక్షేమంపై సీఎం చంద్రబాబుకు ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమని ఫెడరేషన్ రాష్ట్ర డైరెక్టర్ మద్దిరాల గంగాధర్ అన్నారు. సోమవారం ఆయన క్రోసూరులో విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ నిర్ణయం వల్ల నాయీబ్రాహ్మణ సామాజికవర్గానికి ఎంతో మేలు జరుగుతుందన్నారు. దేవాలయ ట్రస్ట్‌బోర్డు సభ్యులుగా నాయీ బ్రాహ్మణులకు ప్రాతినిధ్యం కల్పించటం, ఆదరణ పథకం కింద బడ్జెట్‌లో రూ.వెయ్యికోట్ల వృత్తిపనిముట్ల కొనుగోలుకు కేటాయించటం హర్షణీయమన్నారు. స్థానిక నాయీబ్రాహ్మణ సంఘం నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మద్దిరాల గంగాధర్

భక్తిశ్రద్ధలతో అయ్యప్ప పడిపూజలు

క్రోసూరు, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): క్రోసూరులోని వీరభద్రస్వామి దేవాలయంలో జరిగిన అయ్యప్పస్వామి ప్రత్యేక పూజా కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా టీడీపీ జిల్లా నాయకుడు, అయ్యప్ప దీక్షాధారి కంచేటి సాయి బాబును ఘనంగా సత్కరించారు. అయ్యప్ప స్వామి అన్నదానానికి రూ.25వేల విరాళాన్ని సాయి బాబు అందజేశారు. అయ్యప్ప భజన భక్తిశ్రద్ధలతో జరిగింది. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మన్నెం శ్రీనివాసరావు, డాక్టర్ మహమ్మద్ షరీఫ్, దిగుమత్తి అప్పారావు, కంభంపాటి రాము, హనుమంతరావు, దాడి పూర్ణ, గురుస్వామి గురునాథం పాల్గొన్నారు.

● పిడుగురాళ్ల: అయ్యప్పస్వామి దేవాలయంలో పడిపూజ కార్యక్రమం ఆదివారం రాత్రి జరిగింది. దేవాలయ ధర్మకర్త గుండా శ్రీనివాసరావు, డాక్టర్ వున్నం నాగమల్లిఖార్జునరావు, దేవాలయ కమిటీ అధ్యక్షుడు అంచూరి శ్రీనివాసరెడ్డిలు జ్యోతి ప్రజ్వలన చేసి అఖండదీపారాధన కార్యక్రమాన్ని ప్రారంభించారు.

మాలధారులకు సద్ది

కారంపూడి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇనుపరాజుపల్లి గ్రామ సమీపంలో నాగులేరు ఒడ్డున గల గంగా పార్వతి సమేత నీలకంఠేశ్వరస్వామి సన్నిధిలో మాలధారులకు నిత్య సద్దిలో భాగంగా సోమవారం టీడీపీ మండల అధ్యక్షుడు గోళ్ల సురేష్ యాదవ్ సద్ది ఏర్పాటుచేశారు. ముఖ్య అతిథిగా హాజరైన టీటీడీ పాలక మండలి సభ్యుడు జంగా కృష్ణమూర్తి నీలకంఠేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు జరిపారు. మాలధారులతో కలిసి సద్ది చేశారు. అనంతరం జంగా, తహసీల్దార్ వెంకటేశ్వర్లు నాయక్, సురేష్ యాదవ్‌లను కమిటీ సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో గుర్రపుసాల శ్రీనివాసరావు, చల్లా సుబ్బయ్య, ఆర్ఐ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడితే కఠినచర్యలు

● గురజాల కమిషనర్ శివన్నారాయణ

గురజాలటౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): గురజాల నగర పంచాయతీ పరిధిలో అనుమతులు లేకుండా భవన నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని నగర పంచాయతీ కమిషనర్ వైవీఎల్ శివన్నారాయణరావు హెచ్చరించారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పట్టణంలోని అనధికార నిర్మాణాలను పరిశీలించి యజమానులకు నోటీసులు జారీ చేశామన్నారు. ఇంటి ప్లాన్‌లు తీసుకునేలా అవగాహన కల్పించామన్నారు. 31-08-2025 నాటికి నిర్మించిన అన్ని అనధికార భవనాలను క్రమబద్ధీకరించుకునేందుకు ప్రభుత్వం బీపీఎస్‌ను అమలు పరిచిందన్నారు. అలాగే 30-06-2025 నాటికి ఉన్న అనధికార లేఅవుట్లను క్రమబద్ధీకరించుకొనుటకు ప్రభుత్వం లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీంను అమలు చేశారన్నారు. ప్రభుత్వ నిబంధనలు పాటించకుంటే నిర్మాణాలను కూల్చివేస్తామని హెచ్చరించారు.

పన్ను వసూళ్లకు స్వర్ణయాప్

రెంటచింతల, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): పంచాయతీల్లో ఆస్తి పన్ను వసూళ్లలో పారదర్శకతకు ప్రభుత్వం స్వర్ణ పంచాయతీ పోర్టల్‌యాప్‌ను ప్రారంభించిదని ఎంపీడీవో సీహెచ్ శ్రీనివాసరావు చెప్పారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నగదు రహిత చెల్లింపుల కోసం యాప్‌ను ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిందన్నారు. పంచాయతీలకు వచ్చే నిధులు, వ్యయం, పన్నుల స్వీకరణ దీని నుంచే చేపట్టాలన్నారు. నిధుల వినియోగంలో అక్రమాలకు అడ్డుకట్ట వేయాలన్నది దీని లక్ష్యమన్నారు. ఇంటి, నీటి పన్ను, ట్రేడ్ లైసెన్సు ఫీజు, సెల్ టవర్, వేలం రుసుంలు అన్నీ ఈ డిజిటల్ విధానంలో ఇంటి నుంచే జమచేయవచ్చన్నారు. సమావేశంలో శ్రీకాంత్‌రెడ్డి, వెంకయ్య, బాబులాల్, శౌరి కుమారి, వెంకటరెడ్డి, నరేంద్రారెడ్డి, రమేష్‌నాయక్, బాలునాయక్ తదితర కార్యదర్శులు పాల్గొన్నారు.

తంగెడ మేజరు కాలువ చివరి భూములకు నీరివ్వాలి

● మిర్చి రైతుల డిమాండ్



సమావేశమైన ఇరిగేషన్ శాఖ అధికారులు, డీసీ చైర్మన్‌లు, రైతులు

దాచేపల్లి, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): తంగెడ మేజరు కాలువ పరిధిలోని మిర్చి పంటకు సాగునీరు సక్రమంగా అందించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. సోమవారం దాచేపల్లిలోని నాగార్జునసాగర్ ఇరిగేషన్ శాఖ కార్యాలయం వద్ద తంగెడ, దాచేపల్లి, సారంగపల్లె అగ్రహారం, వేమవరం, ముత్యాలంపాడు, మాదినపాడు గ్రామాల రైతులు డీసీ చైర్మన్ పగడాల భాస్కరరావు అధ్యక్షతన సమావేశం అయ్యారు. అధికారులు స్పందించి సాగునీరు అందించాలని డిమాండ్ చేసినవారిలో తంగెడ సర్పంచ్ యంపరాల హుస్సేన్, ఈసురాజుల రామారావు, పమ్మి గోవిందరెడ్డి, పాశం వెంకటేశ్వరరెడ్డి, నలబోతుల కోటేశ్వరరావు ఉన్నారు. సమావేశంలో ఇరిగేషన్ శాఖ డీఈ పసుపులేటి ఆదినారాయణ, ఏఈ దాసరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పత్తి కొనుగోళ్ళ పరిశీలన



పత్తిలో తేమ శాతాన్ని పరిశీలిస్తున్న అధికారులు

సత్తెనపల్లి రూరల్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని లక్ష్మీ కాటన్ ట్రేడింగ్ కంపెనీలో ఏర్పాటుచేసిన సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని మండల స్థాయి అధికారుల బృందం సోమవారం సందర్శించింది. పత్తి కొనుగోళ్ళ తీరును అధికారులు పరిశీలించారు. పత్తిలో తేమశాతం పరిశీలించారు. రైతులకు ఇబ్బంది కలగకుండా కొనుగోళ్ళు జరగాలని సీసీఐ బయ్యర్‌ను అధికారులు ఆదేశించారు. అధికారుల బృందంలో తహసీల్దార్ కేఎస్ చక్రవర్తి, ఎంపీడీవో బండి శ్రీనివాసరెడ్డి, ఏవో బీ సుబ్బారెడ్డి తదితరులు ఉన్నారు.

ప్రకృతి వ్యవసాయం చేసేలా రైతులను ప్రోత్సహించాలి



ప్రకృతి వ్యవసాయ సిబ్బందితో మాట్లాడుతున్న డివిజన్ ఇన్‌చార్జ్ జయలక్ష్మి

క్రోసూరు, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): రైతులు ప్రకృతి వ్యవసాయాన్ని చేపట్టేలా సిబ్బంది ప్రోత్సహించాలని డివిజన్ ఇన్‌చార్జ్ జయలక్ష్మి అన్నారు. సోమవారం క్రోసూరు వెలుగు కార్యాలయంలో క్రోసూరు, అచ్చంపేట, అమరావతి మండలాల ప్రకృతి వ్యవసాయ సిబ్బందితో ఆమె మాట్లాడారు. రైతులందరూ ఏ గ్రేడు, ఏటీఎం మోడల్‌లో సాగుచేసేలా నిర్దేశం చేయాలన్నారు. రైతులకు స్వయంగా జీవామృతాలను తయారు చేసుకొనేలా ప్రోత్సహించాలని, ఆర్‌డీఎస్, ఎస్‌టీఎస్ కిట్‌లను తయారు చేసుకునేలా వారికి సూచించాలన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది శ్రీనివాసరెడ్డి, పగిడి రాజు, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

సబ్‌స్టేషన్ నిర్మాణానికి స్థల పరిశీలన

దుర్గి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓబులేశునిపల్లె గ్రామంలో గత కొన్నేళ్లగా సబ్‌స్టేషన్ లేకపోవడంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతోంది. ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి సబ్‌స్టేషన్ ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలించాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. ఈ మేరకు సోమవారం తహసీల్దార్ కరుణకుమార్ స్థలాన్ని పరిశీలించారు. ఆయన వెంట మాగులూరి శ్రీను, ఉన్నం మహేష్, కోట లక్ష్మయ్య తదితరులు ఉన్నారు.





వెలలేనివి వీరి సేవలు

● బిడ్డల కోసం గురువులుగా మారిన అమ్మలు

నరసరావుపేట కల్చరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఎన్నో ఆశలతో, నవమాసాలు మోసి కన్న బిడ్డ మనో వైకల్యంతో పుడితే ఏ తల్లి గుండె బద్దలు కాకుండా ఉంటుంది.. ఆమె గుండె కోతను మాన్పడం ఎవరి తరమౌతుంది. అదుగో అలాంటి కడుపుకోతను ఈ అమ్మలు అనుభవించారు. తమ బిడ్డ అందరిలా లేడని ఎన్నో నిద్రలేని రాత్రులు గడిపారు. కానీ అది తమ సమస్యకు పరిష్కారం కాదని గ్రహించారు. తామే టీచర్లుగా మారి తమ బిడ్డతో పాటు మరెంతోమంది మనోవైకల్యంతో బాధపడుతున్న పిల్లల్లో మార్పు కోసం కృషి చేస్తున్నారు. అమ్మే ఆదిగురువు అని నిరూపిస్తున్నారు. మనోవైకల్యంతో ఉన్న పిల్లలకు వెలలేని సేవలు అందిస్తున్నారు. పట్టణంలోని పెద్ద చెరువులో ప్రత్యేక అవసరాల కోసం ఉన్న ఇంటిగ్రేటెడ్ హైస్కూల్‌లో పట్టణానికి చెందిన కొంతమంది మనోవైకల్యంతో ఉన్న తమ పిల్లలను పాఠశాలలో చేర్పించడానికి వచ్చారు. తర్వాత తమ బిడ్డకు ఉపయోగపడుతుందని స్పెషల్ ఎడ్యుకేషన్‌లో శిక్షణ పొంది, ఇప్పుడు ఇదే పాఠశాలలో టీచర్లుగా చేరి ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు బోధన చేస్తున్నారు.

అందరూ ఓర్పుతో సేవ చేస్తున్నారు

ఇక్కడ పనిచేసే టీచర్లలో ఎక్కువ మంది అలాంటి పిల్లల తల్లులే. వాళ్ల బాబును చేర్పించడానికి వచ్చి టీచర్లుగా మారారు. మా కాలేజీలోనే వాళ్లకు స్పెషల్ ఎడ్యుకేషన్ ట్రైనింగ్ ఇప్పించి టీచర్‌గా రిక్రూట్ చేసుకున్నా. వాళ్ల బాబుతో పాటు ఇక్కడి పిల్లలకు ఎంతో ఓర్పుతో సేవ చేస్తున్నారు. అలాంటి టీచర్లు పది నుంచి పదిహేను మంది దాకా ఉన్నారు.

-ఇందిర, ప్రిన్సిపాల్, ఇంటిగ్రేటెడ్ హైస్కూల్

బాబులో మార్పు వస్తోంది

● శివపార్వతి, టీచర్

మాది మేనరిక వివాహం. బాబు పుట్టిన సంవత్సరం దాకా ఎలాంటి మార్పు లేకపోవడంతో డాక్టర్లకు చూపించాం. డాక్టర్లు సెరిబ్రల్ పాల్సీ అని చెప్పారు. అప్పుడు మేము పడ్డ బాధ పగవాడికి కూడా వద్దు. ఎన్నో నిద్రలేని రాత్రులు గడిపాం. దేవుడు మాకే ఎందుకిలా చేశాడని బాధ పడ్డాం. తర్వాత తెల్సినవాళ్లు చెబితే ఇక్కడ చేర్పించాం. నేను డిగ్రీ చదివా. స్పెషల్ ఎడ్యుకేషన్ చేస్తే బాబుకు ఉపయోగపడుతుందని భావించా. ఇప్పుడు ఇక్కడే టీచర్‌గా చేస్తూ మా బాబుతో పాటు మిగతా పిల్లలకు సేవ చేస్తున్నా. బాబులో మార్పు వచ్చింది. బాబుతో పాటు మిగతా పిల్లలకు సేవ చేయడం అదృష్టంగా భావిస్తున్నా.





దేవుని సేవ చేస్తున్నట్లుంది

● వింధ్యారాణి, టీచర్

నా పేరు వింధ్యారాణి. మావారు గవర్నమెంట్ టీచర్. నాకు ఇద్దరు బాబులు. పెద్ద బ్బాయి ఇంజనీరింగ్ చదువుతున్నాడు. మా రెండో అబ్బాయికి సెరిబ్రల్ పాల్సీతో ఎదుగుదల ఆగిపోయింది. మొదట మేం చాలా బాధ పడ్డాం. మెల్లగా బాధను మర్చిపోయి ఇక్కడ చేర్పించాం. నేను ఎమ్మెస్సీ ఎంఈడీ చేశాను. రోజూ మా బాబు కోసం ఇక్కడకు వస్తున్నప్పుడు నేనే స్పెషల్ ఎడ్యుకేషన్ చేసి నా బాబుతో పాటు ఇంకొంతమంది పిల్లలకు సేవ చేయొచ్చుకదా అనిపించింది. కోర్సు కంప్లీట్ చేసి ఇక్కడే టీచర్‌గా ఉంటూ మా బాబుతో పాటు ఇలాంటి పిల్లలకు బోధిస్తున్నాను. ఇలాంటి పిల్లలకు బోధించడం దేవుని సేవ చేస్తున్నట్లుగా ఉంది.

బాబు కోసం ఫిజియో థెరపిస్టుగా మారా

● కోమలి, అసిస్టెంట్ ఫిజియోథెరపిస్ట్

మా బాబుకు సెరిబ్రల్ పాల్సీ రావడంతో కదలికలు సరిగ్గా చేయలేకపోయేవాడు. ఫిజియోథెరపీ చేయించడానికి ఇక్కడికి తీసుకొచ్చేదాన్ని. థెరపీ చేయించాక కొంచెం మార్పు కన్పించింది. రోజూ వస్తున్నప్పుడు ఫిజియోథెరపీలో శిక్షణ పొందితే బాబుకు ఉపయోగపడుతుందని, ట్రైనింగ్ పొందా. తర్వాత ఇక్కడే అసిస్టెంట్‌గా చేరా. ఇప్పుడు బాబుతో పాటు మిగతా పిల్లలకు ఫిజియోథెరపీ చేస్తున్నా. బాబులో మార్పు వస్తుంది.





మల్కాపురం చెరువు కట్ట పనులు చేస్తున్న ఎక్స్‌కవేటర్

మల్కాపురం చెరువు ప్రక్షాళన

● ఏడీసీ ఆధ్వర్యంలో పనులు

తుళ్లూరు (మల్కాపురం), నవంబరు 17 (ఆంధ్ర జ్యోతి): రాజధాని గ్రామం మల్కాపురం చెరువు ప్రక్షాళనకు ఏడీసీ అధికారులు శ్రీకారం చుట్టారు. ఆర్‌అండ్‌బీ రోడ్డు పక్కన ఎస్టీ కాలనీ చెంతనే ఈ చెరువు నెలకొని ఉంది. పూర్వం కాకతీయులు కాలంలో రాణిరుద్రమ్మదేవి ఏలుబడిలో మందడం (మందారం) మల్కాపురం ప్రాంతాలుండేవని చరిత్ర చెబుతోంది. ఇప్పుడు ఉన్న ఎస్టీ కాలనీలో శివాలయం, రాణి రుద్రమ్మ దేవి జన్మదిన సందర్భంగా ఏర్పాటు చేసిన శిలా శాసనం ఇప్పటికీ ఉన్నాయి. అక్కడే కోనేరుండేదని చెబుతున్నారు. ఇప్పుడు ప్రక్షాళన చేస్తున్న చెరువే.. ఆ కోనేరని గ్రామస్థులు పేర్కొంటున్నారు. కాలక్రమంలో కోనేరు కాస్త మురుగు చెరువుగా మారింది. గ్రామంలో వాడేసిన వేస్ట్ వాటర్, పక్కన ఎస్టీ కాలని వాసుల ఇళ్లలోని మురుగు నీరు ఈ చెరువులోకి చేరి దుర్గంధం వెదజల్లుతుండేది. దశాబ్దాల కాలంగా సమస్య అలాగే ఉంది. గత టీడీపీ ప్రభుత్వంలో సీఎం చంద్రబాబు నాయుడు శివాలయం శిలాశాసనం సందర్శించి చెరువును ప్రక్షాళన చేయాలని అధికారులను ఆదేశించారు. తరువాత ఎన్నికల సమయం దగ్గర పడటంతో విషయం మరుగున పడింది. ఎట్టకేలకు కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత మురుగు చెరువు ప్రక్షాళనకు అడుగులు పడ్డాయి. మురుగు నీరు అంతా బయటకు పంపి చుట్టూ కట్టలను బలంగా వేస్తున్నారు. గ్రామంలో వాడేసిన వేస్ట్ వాటర్ చెరువులోకి రాకుండా ప్రత్యేక డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నారు. అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏడీసీ) వారు అమరావతి నగర బ్యూటిఫికేషన్ కింద మల్కాపురం చెరువును ఆహ్లాదకరంగా మలచనున్నారు.

వినుకొండ ఆస్పత్రి సూపరింటెండెంట్ సస్పెన్షన్

● మరో డాక్టర్‌కు షోకాజ్ నోటీసులు

వినుకొండటౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): వినుకొండ ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాసరెడ్డి సస్పెన్షన్‌కు గురయ్యారు. ఆయనను వైద్యశాఖ డైరెక్టర్ చక్రధర్ బాబు సస్పెండ్ చేసినట్లు సోమవారం వైద్యశాల సిబ్బంది తెలిపారు. గతంలో శ్రీనివాసరెడ్డిపై మహిళా డాక్టర్లు పలు ఆరోపణలు చేస్తూ వైద్యశాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో ఈ నెల 4న గుంటూరు జిల్లా డీసీహెచ్‌ఎస్ ప్రసూన వినుకొండ ప్రభుత్వాసుపత్రిని సందర్శించి విచారణ చేపట్టి నివేదికను ఉన్నతాధికారులకు అందచేశారు. దాని ఆధారంగా డాక్టర్ శ్రీనివాసరెడ్డిని తాత్కాలికంగా సస్పెండ్ చేశారు. మరొక డాక్టర్ సుధాకర్ విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ఆయనకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు.

చారిత్రక శాసనాలపై అధ్యయనం



వెలుగుచూసిన రాగిశాసనాలు

(బాపట్ల, చెరుకుపల్లి-ఆంధ్రజ్యోతి)

చారిత్రక శాసనాలను రక్షించడంతో పాటు వాటిపై అధ్యయనం చేసే విధంగా ప్రభుత్వం కృషి చేస్తోందని ఆర్కియాలజీ సర్వే ఆఫ్ ఇండియా డైరెక్టర్ (మైసూర్) మునిరత్నం రెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. చెరుకుపల్లి మండలం పొన్నపల్లిలోని అగ్రహారంలో వెలుగుచూసిన రాగిశాసనాల సాఫ్ట్ కాపీ ప్రతులు ఆయా వంశస్థుల దగ్గర నుంచి అందినట్లు ఏఎస్ఐ డైరెక్టర్ ధ్రువీకరించారు. శాసనాలు సంస్కృతం, తెలుగు లిపిలో రాసి ఉన్నట్లు ఆయన వివరించారు. అష్టాంగ ఆయుర్వేద వైద్యం గురించి ఓ శాసనంలో తెలిపినట్లు గుర్తించామన్నారు. వాటిని డీ కోడింగ్ చేయడంపై కసరత్తు జరుగుతోందని, చారిత్రక శాస నాల సమాచారం ఏదైనా అందుబాటులో ఉంటే వెంటనే ఆర్కియాలజీ విభాగానికి తెలపాలన్నారు. త్వరలోనే పొన్నపల్లి గ్రామ అగ్రహారాన్ని పు రావస్తుశాఖ అధికారుల బృందం సందర్శించడంతో పాటు ఆ శాసనాలను ప్రత్యక్షంగా పరిశీలించడం జరుగుతుందని డైరెక్టర్ మునిరత్నం రెడ్డి తెలిపారు.

● అగ్రహారానికి చారిత్రక నేపథ్యం

చెరుకుపల్లి మండలం పొన్నపల్లి అగ్రహారానికి చెందిన పొన్నపల్లి విద్యాభాస్కర్ పూర్వీకులు 14వ శతాబ్దంలో కొండవీడును పరిపాలించిన రెడ్డి రాజుల ఆస్థానంలో వేద పండితులుగా, ఆయుర్వేద వైద్యులుగా సేవలందించారు. కొండపల్లి అగ్రహారాన్ని దానంగా పొందిన వారసుల్లో ఒకరు విద్యాభాస్కర్ కాగా, ప్రస్తుతం రాగి శాసనాలను వెలుగులోకి తెచ్చి వాటిపై అధ్యయనం చేయాలని ఆర్కియాలజీ విభాగాన్ని కోరుతూ వివరాలందించారు. 700 ఏళ్ల తర్వాత కూడా ఆ నాటి రాగి శాసనాలు చెక్కు చెదరకుండా గత వైభవానికి ప్రతీకలుగా నిలవడం గమనార్హం.

కిక్కిరిసిన ఆలయాలు

● కార్తికమాసం చివరి సోమవారాన భారీగా తరలివచ్చిన భక్తులు



భక్తులతో పోటెత్తిన పెదకాకాని శివాలయం

అమరావతి/పెదకాకాని/బాపట్ల/నరసరావుపేట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కార్తిక మాసం చివరి సోమవారాన జిల్లాలోని ఆలయాలు భక్తులతో కిక్కిరిశాయి. పెదకాకాని మల్లన్న సన్నిధికి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. వేకువజాము నుంచే పుణ్య స్నానాలు ఆచరించి, భక్తి శ్రద్ధలతో ఆలయ ప్రాంగంలో ప్రదక్షిణలు చేసి కార్తిక మాస దీపారాధనలు చేశారు. అనంతరం శ్రీ మల్లేశ్వరస్వామిని దర్శించుకొని ప్రత్యేక అభిషేకాలు జరిపారు. భక్తులకు ఏ విధమైన అసౌకర్యం కలగకుండ ఆలయ ఉపకమీషనర్ గోగినేని లీలాకుమార్ ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. వివిధ సేవా రుసుములు, అన్నదాన విరాళాలు, ప్రసాద విక్రయం ద్వారా రూ.9 లక్షల 10 వేల ఆదాయం వచ్చిందని ఉపకమీషనర్ తెలిపారు. కాగా, స్వామి వారిని విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని దంపతులు దర్శించుకున్నారు.

భక్తజన సంద్రంగా అమరేశ్వరాలయం

కార్తికమాసం చివరి సోమవారం పంచారామ క్షేత్రాలలో ప్రథమ ఆరామమైన అమరావతి బాలచాముండికా సమేత అమరేశ్వరాలయం భక్తజన సంద్రంగా మారింది. భక్తులు వెలిగించిన కార్తికదీపాలతో కృష్ణాతీరం వెలుగులు విరజిమ్మింది. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. తెల్లవారు జామున పవిత్ర కృష్ణానదిలో స్నానమాచరించి నదీ తీరంలో కార్తిక దీపాలను వెలిగించి నదిలో వదిలారు. సాయంత్రం వరకు భక్తుల రాకతో క్యూలైన్‌లు రద్దీగానే ఉన్నాయి. ఆలయంలో ఏర్పాట్లను ఈవో రేఖ పర్యవేక్షించారు.

జనసంద్రంగా సూర్యలంకతీరం

కార్తికమాసం చివరి సోమవారం సూర్యలంకతీరం జనసంద్రంగా మారింది. భక్తులు తెల్లవారుజామునే సముద్రస్నానాలు ఆచరించి సూర్యనమస్కారాలు చేసి ఇసుకతో శివలింగాలు అలంకరించారు. కార్తికదీపాలు వెలిగించి మహిళలు పెద్దఎత్తున పూజలు చేశారు. ఎలాంటి అవాంచనీయ ఘటనలు జరగకుండా పోలీసులు, గజఈతగాళ్ళు తీరంలో గస్తీ నిర్వహించారు.

● ప్రముఖ శైవక్షేత్రం కోటప్పకొండలో కార్తిక మాస చివరి సోమవారం భక్తుల కోలాహలం నెలకొంది. శ్రీ మేధా దక్షిణామూర్తి స్వరూప త్రికోటేశ్వర స్వామికి పంచామృతాలు.. ఫలరస సహిత సుగంధ ద్రవ్యాలతో మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు వైభవంగా జరిగాయి. భక్తులు కొండకు తరలివచ్చి స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు.



అమరావతి : క్యూలో బారులు దీరిన భక్తులు

కోటి దీపోత్సవం

రాజధాని అమరావతి నిర్మాణం పూర్తిచేసుకుని వెలుగొందాలని ఆకాంక్షిస్తూ అమరేశ్వరాలయంలో భారతీయ జనతాపార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి హిందూ ధర్మపరిరక్షణ సమితి అధ్యక్షుడు దర్శనపు శ్రీనివాస్ కోటి దీపోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గజల్ శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా విచ్చేశారు. అనూ డ్యాన్స్ అకాడమీ విద్యార్థులు జ్ఞానతి, వైష్ణవి, పుణ్యవతి, లక్ష్మీ ప్రణతి కూచిపూడి నృత్యప్రదర్శన ఇచ్చారు.



సూర్యనారాయణకు జీవిత సాఫల్య పురస్కారం



లంకా సూర్యనారాయణకు జీవిత సాఫల్య పురస్కారాన్ని ప్రదానం చేస్తున్న నిర్వాహకులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): గుంటూరు బృందావన్ గార్డెన్స్‌లో అన్నమయ్య ఆధ్యాత్మిక గ్రంథాలయాన్ని ఏర్పాటు చేసి 1.3 లక్షల పుస్తకాలను సేకరించి, భద్రపరిచి, డిజిటలైజేషన్ చేస్తున్న లంకా సూర్యనారాయణను జీవిత సాఫల్య పురస్కారంతో సత్కరించారు. తిరుపతిలోని ఎస్వీయూ లైబ్రరీ సైన్స్ విభాగం - ఇన్‌ఫ్లిబ్‌నెట్ సంయుక్తంగా చేపట్టిన మూడు రోజుల అంతర్జాతీయ సదస్సు సోమవారం ప్రారంభమైంది. లైబ్రరీ-2047: డెమొక్రటైజింగ్ నాలెడ్జ్ టువర్డ్స్ వికసిత్ భారత్ అంశంపై శ్రీనివాసా ఆడిటోరియం వేదికగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్వీయూ ప్రధాన గ్రంథాలయం డైరెక్టర్ ప్రొఫెసర్ కొంగర సురేంద్రబాబు, అకాడమీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ కార్యదర్శి పాంద్ర సురేంద్రబాబు తదితరులు శాలువా, పుష్పగుచ్ఛం, జ్ఞాపికతో లంకా సూర్యనారాయణను సన్మానించారు. గ్రంథాలయానికి, పుస్తక విజ్ఞాన వ్యాప్తికి ఆయన చేస్తున్న కృషిని కొనియాడారు. రాబోయే తరానికి కూడా స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని ఎస్వీయూ వీసీ నరసింగరావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు, సాహిత్యవేత్తలు కోట పురుషోత్తం, డాక్టర్ నాదెండ్ల శ్రీమన్నారాయణ, వర్సిటీ కల్చరల్ కో-ఆర్డినేటర్ డాక్టర్ పత్తిపాటి వివేక్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విభీషణ శర్మ, పలువురు అధ్యాపకులు, విద్యార్థులు, వివిధ ప్రాంతాల ప్రతినిధులు, లంకా సూర్యనారాయణ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల అడ్డుకట్టకు ప్రణాళిక

● హైవేపై 12 కీలక ప్రమాద ప్రాంతాలు గుర్తింపు ● ఎన్‌హెచ్‌ఏఐకు నివేదిక ● సౌత్ డీఎస్పీ భానోదయ

గుంటూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): సౌత్ సబ్ డివిజన్ పరిధిలో రోడ్డు ప్రమాదాలు అరికట్టేందుకు ప్రత్యేక దృష్టి సారించినట్లు సౌత్ డీఎస్పీ భానోదయ వెల్లడించారు. సౌత్ సబ్ డివిజన్ పరిధిలో 28 కిలోమీటర్ల పొడవున జాతీయ రహదారి ఉందన్నారు. ఇందులో 12 కీలకమైన ప్రమాద ప్రాంతాలను గుర్తించినట్లు ఆమె తెలిపారు. ఇందుకు గాను క్షేత్ర స్థాయిలో పర్యటించడంతో పాటు నిత్యం ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి అందుకు గల కారణాలను విశ్లేషించామన్నారు. దీనిలో భాగంగా సోమవారం సౌత్ సబ్-డివిజన్ పరిధిలోని నల్లపాడు, ప్రతిపాడు పోలీస్‌స్టేషన్ పరిధిలోని జాతీయ రహదారిపై అధికారుల బృందం సమగ్ర పర్యటన నిర్వహించింది. ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న ప్రదేశాలు (బ్లాక్‌స్పాట్స్)ను పరిశీలించి, ఆయా ప్రాంతాల్లో ప్రమాద నివారణ చర్యలను మరింత బలోపేతం చేసే దిశగా చర్యలు ప్రారంభించామన్నారు. ఈ మేరకు ఆయా ప్రమాద స్థలాల్లో సరిపడా లైటింగ్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అలాగే హెచ్చరిక బోర్డులు, సూచిక చిహ్నాలు, రిఫ్లెక్టివ్ మార్కింగ్‌లు, సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. ప్రమాద ప్రాంతాల వద్ద ఫెన్సింగ్ ఏర్పాటు చేయాల్సి ఉందని గుర్తించారు. వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు స్పీడ్ బ్రేకర్లు, రంబుల్ స్ట్రిప్స్ ఏర్పాటు చేయాలన్నారు. రహదారి రూపకల్పనలో అవసరమైన ఇంజనీరింగ్ మార్పులపై సాంకేతిక అధ్యయనం చేయాల్సి ఉందన్నారు. పాదచారుల భద్రత కోసం పాదచారి మార్గాలు, జీబ్రా క్రాసింగ్‌లు, అవసరమైతే ఫుట్ ఓవర్ బ్రిడ్జీల ఏర్పాటుకు పరిశీలించాల్సి ఉందన్నారు. అధిక ట్రాఫిక్ ప్రాంతాల్లో ట్రాఫిక్ సిగ్నల్స్ అవసరంపై చర్చించారు. ఈ అధ్యయనం ఆధారంగా ఒక ప్రత్యేక సాంకేతిక నివేదికను తయారు చేసి, దాన్ని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్‌కు, భారత జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ)కు సమర్పించనున్నట్లు డీఎస్పీ భానోదయ తెలిపారు. ఈ నివేదిక ఆధారంగా రహదారి భద్రతా చర్యలు మరింత వేగంగా అమలులోకి వస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీతో పాటు మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ మల్లేశ్వరి, ఎన్‌హెచ్‌ఏఐ సీనియర్ ఇంజనీర్ దత్తాత్రేయ, నల్లపాడు సీఐ వంశీధర్, ప్రత్తిపాడు సీఐ శ్రీనివాసరావు ఇతర అధికారులు పాల్గొన్నారు.



నల్లపాడు పోలీస్‌స్టేషన్ పరిధిలోని జాతీయ రహదారిపై బ్లాక్‌స్పాట్స్‌ను పరిశీలిస్తున్న సౌత్ డీఎస్పీ భానోదయ, నల్లపాడు సీఐ వంశీధర్

సమాజాభివృద్ధిలో సహకార సంఘాల పాత్ర కీలకం

● విశాఖ కో-ఆపరేటీవ్ బ్యాంక్ మాజీ చైర్మన్ మానం

వట్టిచెరుకూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): సమాజాభివృద్ధికి సహకార సంఘాలు కీలక సేవలు అందిస్తున్నాయని కోఆపరేటీవ్ బ్యాంక్ మాజీ చైర్మన్ ఆంజనేయులు అన్నారు. భారత ప్రభుత్వం ఈ నెల 20వ తేదీ వరకు భారతీయ సహకార సంఘాల వారోత్సవాలను ప్రకటించిన నేపథ్యంలో.. వట్టిచెరుకూరు మండలంలోని పుల్లడిగుంట సమీపంలో ఉన్న మలినేని లక్ష్మయ్య మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం కోఆపరేటీవ్ బిల్డ్ ప్రాస్పరిటీ ఫర్ ఆల్ అనే అంశంపై పీజీ విద్యార్థులకు అవగాహన సదస్సులు నిర్వహించారు. ది విశాఖపట్నం కో-ఆపరేటీవ్ బ్యాంక్ లిమిటెడ్ గుంటూరు శాఖ సౌజన్యంతో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ చైర్మన్ మానం ఆంజనేయులు హాజరై సహకార సంఘాల పాత్రలను వివరించారు. కళాశాల చైర్మన్ డాక్టర్ మలినేని పెరుమాళ్ళు మాట్లాడుతూ సహకార సంఘ బ్యాంకులు పేద, మధ్య తరగతి కుటుంబాలకు, చిరు వ్యాపారులకు సరళమైన రుణాలు అందిస్తున్న విధానాలను వివరించారు. బ్యాంక్ సిబ్బంది పీజీ విద్యార్థులతో కలసి సహకార సంఘాల వారోత్సవాల లోగోను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ జె.అప్పారావు, డైరెక్టర్ డాక్టర్ వెంకటేశ్వరరావు, అకడమిక్ ప్రొఫెసర్ జె.కిషోర్ బాబు, ఎంబీఏ విభాగాధిపతి కల్యాణ చక్రవర్తి, ఎంబీఏ, ఎంసీఏ అధ్యాపకులతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.



ది విశాఖపట్నం కోఆపరేటీవ్ బ్యాంక్ లిమిటెడ్ మాజీ చైర్మన్ మానం ఆంజనేయులును సన్మానిస్తున్న మలినేని యాజమాన్యం

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

వృద్ధాశ్రమంలో న్యాయ విజ్ఞాన సదస్సు

నరసరావుపేట లీగల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చిలకలూరిపేట రోడ్డులోని అమ్మానాన్నల వృద్ధాశ్రమంలో శనివారం మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న రెండో అదనపు జూనియర్ సివిల్ న్యాయాధికారి గాయత్రి వృద్ధుల పోషణ, సంక్షేమం, తల్లిదండ్రులు సీనియర్ సిటిజన్ల చట్టం, వారికి లభించే న్యాయ సేవల వివరాలు, లోక్ అదాలత్ చట్టం తదితర అంశాలను వివరించారు. కార్యక్రమంలో వృద్ధాశ్రమ నిర్వాహకులు, ప్యానల్ న్యాయవాదులు, ఎన్జీవో ప్రతినిధులు పాల్గొన్నారు.

న్యాయాధికారి నేతి సత్యశ్రీ బదిలీ

నరసరావుపేట లీగల్, నవంబరు 17, (ఆంధ్రజ్యోతి): స్థానిక 13వ అదనపు జిల్లా సెషన్స్ న్యాయ అధికారి నేతి సత్యశ్రీని అనంతపురం మూడో అదనపు జిల్లా ఫాస్ట్ ట్రాక్ కోర్టు న్యాయాధికారిగా బదిలీచేస్తూ హైకోర్టు సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆమె స్థానంలో పూర్తి ఇంచార్జ్ న్యాయ అధికారిగా బాపట్ల ఆరో అదనపు జిల్లా ఫాస్ట్ ట్రాక్ న్యాయాధికారి శ్యాం బాబును నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

రేపు ఎయిర్‌ఫోర్స్‌లో ఉద్యోగావకాశాలపై అవగాహన

నరసరావుపేట కల్చరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 19న ఎయిర్‌ఫోర్స్ ఉద్యోగావకాశాలపై అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు సోమవారం కలెక్టర్ కృతికాశుక్లా చెప్పారు. స్థానిక ఎస్ఎస్ఎన్ కళాశాలలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఈ సదస్సు జరుగుతుందని చెప్పారు.

బరంపేటలో చైన్ స్నాచింగ్

నర్సరావుపేట లీగల్, నవంబరు 17: (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బరంపేటలో ఉదయం 6గంటల సమయంలో ఇంటి బయట ముగ్గువేస్తున్న ఓ మహిళ మెడలోని బంగారు ఆభరణాన్ని ఇద్దరు యువకులు లాక్కొని వెళ్లిన సంఘటన సోమవారం ఉదయం చోటు చేసుకుంది. బరంపేటకు చెందిన పెరుగుపల్లి అభినయ ఉదయం 6 గంటలకు తన ఇంటి ఎదుట ముగ్గు వేస్తుండగా గుర్తుతెలియని ఇరువురు యువకులు మోటార్ సైకిల్‌పై వచ్చి ఆమె మెడలోని బంగారు ఆభరణాన్ని లాక్కుని వెళ్లారు. ఈ మేరకు బాధితురాలు రెండో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

హోంగార్డ్ కుటుంబాలకు చేయూత

నరసరావుపేట లీగల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో మరణించిన హోంగార్డు కుటుంబాలకు తోటి హోంగార్డులు తమ ఒక్కరోజు వేతనాన్ని ఆర్థిక సాయంగా అందించడంపై పల్నాడు జిల్లా పరిపాలన అదనపు ఎస్పీ సంతోష్ హర్షం వ్యక్తం చేశారు. వినుకొండ పట్టణ పోలీస్ స్టేషన్లో సేవలందిస్తూ ఈ ఏడాది జూన్ 7న అనారోగ్యంతో మృతిచెందిన హోంగార్డు విజయ్‌బాబు కుటుంబ సభ్యులకు రూ.5 లక్షలు చెక్కు, బాపట్ల సబ్ జైల్లో సేవలందిస్తూ ఈ ఏడాది జూన్ 14న అనారోగ్యంతో మృతి చెందిన పద్మ కుటుంబ సభ్యులకు చెక్కు అందజేశారు. కార్యక్రమంలో హోం గార్డ్ ఆర్ఐ కృష్ణ సిబ్బంది పాల్గొన్నారు.

అలరించిన పౌరాణిక నాటకాలు

నరసరావుపేట కల్చరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): భువనచంద్ర టౌన్‌హాల్ నెలవారీ సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా ఆదివారం రాత్రి ప్రదర్శించిన పౌరాణిక నాటకాలు ప్రేక్షకులను అలరించాయి. ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు జ్యోతి ప్రజ్వలనం చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం వరుసగా పౌరాణిక నాటకాలు ప్రదర్శించారు. కార్యక్రమంలో రాకీ మీడియా అధినేత నల్లపాటి రాము, టౌన్ హాల్ అధ్యక్షులు జె.వెంకట్రావు, పి. శ్రీనివాసరావు, డాక్టర్ ఎం.రాధాకృష్ణమూర్తి, రాయల శ్రీనివాసరావు, కె.లక్ష్మి పాల్గొన్నారు.

క్లుప్తంగా...

● రొంపిచర్ల, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఈనెల 19వ తేదీన వైసీపీ పంచాయతీరాజ్ విభాగం ఆధ్వర్యంలో మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర కార్యదర్శి పడాల చక్రారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

● చిలకలూరిపేట, నవంబరు17 (ఆంధ్రజ్యోతి): స్థానిక పురుషోత్తమపట్నంలో కాపు, బలిజ, తూర్పుకాపు వర్గీయుల ఆత్మీయ సమావేశం, వనభోజనాల కార్యక్రమాలు నిర్వహించారు. ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.

● వినుకొండ టౌన్: మండలంలోని అందుగుల కొత్తపాలెం గ్రామ సమీపంలో గుంటూరు కర్నూలు హైవే రోడ్డు రహదారిపై సోమవారం తెల్లవారుజామున గుర్తుతెలియని వాహనం ఢీకొని రెండు గేదెలు మృతిచెందాయి.

● శావల్యాపురం: కర్నూలు- గుంటూరు జాతీయ రహదారి మార్గంలో శావల్యాపురం సమీపంలోని కొంకేరువాగు వంతెనపై సోమవారం తెల్లవారుజామున కారు బోల్తాపడింది. ఎస్ఐ లేళ్ళ లోకేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం వేమూరు వద్దనున్న పెరవల్లిపాలేనికి చెందిన రాగంశెట్టి శివకోటేశ్వరరావు తన కారును ట్రావెల్స్‌లా తిప్పుతుంటాడు. తెనాలికి చెందిన డ్రైవర్ యోహాన్ కారులో బాడుగకు వెళ్ళి ఒక్కడే తిరిగి వినుకొండ నుంచి నరసరావుపేట వస్తుండగా ఈప్రమాదం జరిగింది. అనంతరం డ్రైవర్ యోహాన్ పరారయ్యాడు.

● నూజెండ్ల: గ్రామాల్లో ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో పీ ఉమాదేవి సోమవారం తెలిపారు. మంగళవారం నూజెండ్ల జెడ్పీ హైస్కూల్ 19, 20, 21 తేదీల్లో ఉప్పలపాడు, 22వ తేదీ చింతలచెరువు, ములకలూరు, రవ్వవరం, 24, 25వ తేదీ నూజెండ్ల, ములకలూరు, 26న కంభంపాడు, కొండలరాయునిపాలెం, ముక్కెళ్ళపాడులో క్యాంపులు నిర్వహిస్తున్నామన్నారు.

● రొంపిచర్ల: మండలంలోని వీరవట్నంలో ఆధార్ క్యాంపును సోమవారం నిర్వహించారు. వీరవట్నం, రైతునగర్, అన్నవరప్పాడులోని పాఠశాలల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగపరుచుకోవాలని డిజిటల్ అసిస్టెంట్ శ్రీకాంత్ కోరారు.

నీరు నిలిచి గ్రంథాలయం మూసివేత

● మోటారు మరమ్మతులతో ఈ దుస్థితి ● అధికారులు, ప్రజా ప్రతినిధులు పట్టించుకోవాలని పలువురి విజ్ఞప్తి



గ్రంథాలయ ఆవరణలో నిల్వ ఉన్న ఊటనీరు

వినుకొండ టౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): విజ్ఞానాన్ని అందించే గ్రంథాలయంలోకి ఊటనీరు చేరడంతో తాళాలు తీయని పరిస్థితి వినుకొండ కీర్తి సినిమా హాల్ పక్కనే ఉన్న గ్రంథాలయంలో చోటు చేసుకుంది. మొంథా తుఫానుతో వర్షాలు కురిసి గ్రంథాలయంలో వర్షపు నీరు చేరడంతో నిర్వాహకులు బద్రీనాయక్ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విద్యార్థులకు, విద్యావంతులకు, మహిళలకు విజ్ఞానాన్ని అందించే విలువైన పుస్తకాలు కొన్ని వర్షపునీటిలో తడవగా నీటిని బయటకు తరలించి కొంతమేరకు విలువైన పుస్తకాలను కాపాడారు. అద్దె గదిలో అండర్ గ్రౌండ్‌లో గ్రంథాలయం కొనసాగుతుండటంతో గడిచిన కొంతకాలంగా ఊటనీరు గ్రంథాలయంలోకి ప్రవహిస్తోంది. విద్యుత్ మోటారు సాయంతో నీటిని బయటకు పంపించినప్పటికీ ఇటీవల మోటారు చెడిపోవడంతో నేడు గ్రంథాలయం అంతా ఊటనీరు ఆవరించి తలుపులు తీయని పరిస్థితి నెలకొని ఉంది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో గ్రంథాలయ నిర్మాణానికి సుమారు రూ.50లక్షల మేరకు నిధులు మంజూరైనప్పటికీ 5సెంట్ల స్థలం చూపకపోవడంతో నేటికి గ్రంథాలయానికి వచ్చే పాఠకులకు కష్టాలు తప్పడం లేదు.

ఘనంగా గ్రంథాలయ వారోత్సవాలు జరుపుకుంటున్న ఈ తరుణంలోనైనా పాలకులు, రెవెన్యూ అధికారులు గ్రంథాలయం పరిస్థితిని దృష్టిలో పెట్టుకొని స్థలం కేటాయించి నూతన గ్రంథాలయాన్ని ఏర్పాటుచేసి విద్యార్థులకు విజ్ఞానాన్ని అందించేందుకు చొరవ చూపాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు.

అర్జీలను త్వరితగతిన పరిష్కరించండి

● కలెక్టర్ కృతికా శుక్లా



అర్జీలు స్వీకరించి వారితో మాట్లాడుతున్న కలెక్టర్ కృతికా శుక్లా తదితరులు

నరసరావుపేట టౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చే అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ కృతికా శుక్లా ఆదేశించారు. సోమవారం నరసరావుపేటలో కలెక్టరేట్‌లో అర్జీదారుల నుంచి 135 అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అర్జీలను నాణ్యతగా పరిష్కరించాలన్నారు. జిల్లా అధికారులు అర్జీలను సకాలంలో పరిష్కరించాలని, ఆయా శాఖల పరిధిలో పీజీఆర్ఎస్ గ్రీవెన్స్‌పై ఆడిట్ నిర్వహించాలన్నారు. అర్జీదారులతో మాట్లాడాలని, పెండింగ్ ఆడిట్ పూర్తి చేయాలన్నారు. జిల్లా అధికారులు వారి పరిధిలో ఎలాంటి పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు అర్జీలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.

గండిగనుమల-దుర్గి రహదారి పూర్తి చేయాలి

నరసరావుపేట టౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): బొల్లాపల్లి మండలం గండిగనుమల నుంచి దుర్గి వెళ్లే రహదారి పూర్తిచేయాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం ఈ మేరకు కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేశారు. ఫారెస్ట్ డిపార్టుమెంట్ వారు అడ్డంకులు పెడుతున్నందున ఈ రోడ్డు వేయకుండా ఆపుతున్నారని వివరించారు. కార్యక్రమంలో కోటానాయక్, శ్రీనునాయక్, షేక్ మస్తాన్‌వలి, ఆర్.కృష్ణ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

● గుంటూరు (తూర్పు): గుంటూరు కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో సోమవారం జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రత్తిపాడు మండలం చినకొండ్రుపాడుకు చెందిన వారు ఫిర్యాదు చేశారు. పూర్వీకుల నుంచి సంక్రమించిన భూమిని జిల్లాకు చెందిన మాజీ మంత్రి ఆక్రమించుకున్నారని ప్రత్తిపాడు మండలం, చిన కొండ్రుపాడుకు చెందిన పంతగాని సంసోన్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. నడింపాలెం గ్రామంలో సర్వే నెంబరు 113/1లో 2.26 ఎకరాల భూమి ఉందన్నారు. కానీ 2006 ఏడాదిలో ఆ మాజీ మంత్రి ఆ భూమి సర్వే నెంబర్లు 110, 111గా మార్చి వేరే వారికి రిజిస్ట్రేషన్ చేశారని ఆరోపించారు. అప్పటి నుంచి ఎమ్మార్వో ఆర్డీవో చుట్టూ తిరుగుతున్నా ఫలితం లేకుండా పోయిందని వాపోయారు.

భక్తి శ్రద్ధలతో కార్తిక మాస పూజలు



కార్తిక మాసం సందర్భంగా అన్నదానంలో పాల్గొన్న భక్తులు

వినుకొండ, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): పలు గ్రామాల్లో కార్తిక మాసం చివరి సోమవారంను పురస్కరించుకొని భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. పట్టణంలోని పాత శివాలయం ఆవరణలో కార్తిక మాసం సందర్భంగా భారీ అన్నదాన కార్యక్రమాన్ని ఆలయ చైర్మన్ కొల్లిపర బాలసుబ్రమణ్యం, కమిటీ మెంబర్ తెలగంశెట్టి పావని ఆధ్వర్యంలో జరిగాయి. కార్యక్రమంలో వినకొండ కొండ కమిటీ, గుంటి ఆంజనేయ స్వామి కమిటీ సభ్యులు పాల్గొన్నారు. జీవీ ఆంజనేయులు దంపతులు శివుని విగ్రహానికి మకర తోరణం శివునికి నాగపడిగ, ఇత్తడి రుద్రాక్ష మండపం అందజేశారు. కార్యక్రమంలో కొండ చైర్మన్ అచ్యుత కోటేశ్వరరావు, భవనాసి రమేష్‌బాబు, కొత్తూరి రవీంద్రబాబు, సి.కోటేశ్వరరావు, లక్ష్మణరావు, శ్రీను, పాల్గొన్నారు.

● నాదెండ్ల: మండలంలోని పలు గ్రామాల్లో కార్తిక మాసాన్ని పురస్కరించుకొని దేవాలయాల్లో భక్తుల సందడి నెలకుంది. సాతులూరులో ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో ఏకాహం నిర్వహించారు.

● శావల్యాపురం: శావల్యాపురం నుంచి కొత్తలూరు మార్గంలోని శ్రీరామపబ్లిక్ స్కూల్లో కార్తిక వనసమారాధన కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. సొసైటీ చైర్మన్ గడిపూడి విశ్వనాథం, జిల్లా తెలుగురైతు ఉపాధ్యక్షుడు గోరింట్ల హనుమంతరావు, ఎంపీడీవో పి.సీతారామయ్య పాల్గొని వకృత్వం, వ్యాసరచన, క్విజ్, చిత్రలేఖనం పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ కేవీఆర్ మోహన్‌చంద్, ప్రిన్సిపాల్ రత్నకుమారి, పంచాయతీ కార్యదర్శి యాకోబు, నాగేశ్వరరావు, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

● రొంపిచర్ల: రొంపిచర్లలోని శంకర స్వామి, విప్పర్లలోని వల్లభేశ్వరస్వామి, వడ్డమూడివారిపాలెంలోని నీలకంఠేశ్వరస్వామి, సంతగుడిపాడులోని వెంకటేశ్వర స్వామి, గోగులపాడులోని చంద్రమౌళేశ్వరస్వామి, వెంకటేశ్వర స్వామి ఆలయాల్లో విశేష పూజలు జరిగాయి.

● నూజెండ్ల: మండలంలోని శివాలయాల్లో కార్తిక సోమవారాన్ని భక్తులు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. కార్తిక దీపాలు వెలిగించి అభిషేకాలు నిర్వహించారు.

● నరసరావుపేట అర్బన్: పట్టణంలోని మునిసిపల్ కార్యాలయ ప్రాంగణంలోని కల్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయంలో కార్తికమాసం సోమవారం సందర్భంగా అర్చకులు చతుర్వేదుల బ్రమరకుమార్ శర్మ విశేష పూజలను నిర్వహించారు.

గ్రంథాలయ వారోత్సవాల్లో తెలుగు భాషపై విద్యార్థులకు అవగాహన



బొల్లాపల్లి: కుర్చీలాట ఆడుతున్న విద్యార్థులు

బొల్లాపల్లి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): బొల్లాపల్లిలో 58వ గ్రంథాలయ వారోత్సవాలు నాల్గోరోజు సోమవారం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో తెలుగు భాషపై విద్యార్థులకు అవగామన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు తెలుగు పద్యాలపై పోటీలు, మ్యూజికల్ చైర్స్ పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు కృష్ణకుమారి, అపర్ణ, విద్యార్థులు, గ్రంథాలయ అధికారి రామావత్ సేవా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

● నాదెండ్ల: గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా నాదెండ్లలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు సోమవారం వ్యాస రచన పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు పంపిణీ చేస్తామని గ్రంథాలయ అధికారి సుబ్బారావు తెలిపారు.

● శావల్యాపురం: గ్రందాలయ వారోత్సవాల్లో భాగంగా జడ్పీపాఠశాల ఆవరణలో విద్యార్థులకు సోమవారం ఆటల పోటీలు నిర్వహించారు. బాలబాలికలకు పరుగుపందెం, మ్యూజికల్ చైర్స్ పోటీలను నిర్వహించి గెలుపొందినవారిని పాఠశాల హెచ్ఎం విజయలక్ష్మి, ఉపాధ్యాయులు వసంతరావులు, గ్రంథాలయాధికారి రావూరి శ్రీనివాసరావు అభినందించారు.

● నరసరావుపేట టౌన్: బాలలను తీర్చిదిద్దటంలో గ్రంథాలయాల పాత్ర కీలకమని శాఖా గ్రంథాలయాధికారి యడ్లపాటి రాధ అన్నారు. సోమవారం నరసరావుపేటలోని శాఖా గ్రంథాలయంలో పిల్లలకు పలు పోటీలు నిర్వహించారు.

● ఈపూరు: ప్రతి ఒక్కరూ గ్రంథాలయాలను ఉపయోగించుకోవాలని ఉమ్మడి గుంటూరు జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వి.సుబ్బరత్నమ్మ అన్నారు. గ్రంథాలయ వారోత్సవాల్లో సందర్భంగా ముప్పాల శాఖా గ్రంధాలయంలో జరుగుతున్న కార్యక్రమాలను సోమవారం ఆమె పరిశీలించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు కనపర్తి హనుమయ్య, గ్రంథాల అధికారులు నాగలక్ష్మి, శ్రీనివాసరావు ఉన్నారు.

● రొంపిచర్ల: మండలంలోని రొంపిచర్ల శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాలను జిల్లా కార్యదర్శి వంకదారి సుబ్బరత్తమ్మ సోమవారం తనిఖీ చేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి కేసరి రమణారెడ్డి పాల్గొన్నారు. సంతగుడిపాడు శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారి నాగుల్ మీరావలి పలు కార్యక్రమాలను నిర్వహించారు.





నిత్య అన్నదానానికి ఎమ్మెల్యేకు, ఈవోకు విరాళం అందజేస్తున్న దాతలు

కోటప్పకొండ అభివృద్ధికి ప్రత్యేక కృషి

● ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు

నరసరావుపేట రూరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ శైవ క్షేత్రమైన కోటప్పకొండను పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు తెలిపారు. నరసరావుపేట పట్టణంలోని గుంటూరు రోడ్డులోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నరసరావుపేట 25వ వార్డుకు చెందిన పొందూరి సాంబశివరావు, పొందూరి రామారావు, పొందూరి వెంకట రమణమ్మ కోటప్పకొండలో నిత్యాన్నదాన కార్యక్రమానికి రూ.2,11,000 రూపాయలు విరాళంగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, కోటప్పకొండ ఆలయ కార్యనిర్వహక అధికారికి సోమవారం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ముగిసిన శిక్షణ తరగతులు

● నరసరావుపేట డివిజన్ ఉపవిద్యాశాఖాధికారి మహబూబ్ సుభాని

నరసరావుపేట కల్చరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) ఈ నెల 10 నుంచి ప్రారంభమైన సబ్జెక్టు ఓరియేంటేషన్ శిక్షణ తరగతులు సోమవారం ముగిసినట్లు నరసరావుపేట డివిజన్ ఉపవిద్యాశాఖాధికారి షేక్ మహబూబ్ సుభాని ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అన్ని ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న సబ్జెక్టు టీచర్లందరికి శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. రానున్న పది పరీక్షలలో నూరుశాతం ఉత్తీర్ణత లక్ష్యంగా కలెక్టర్ ఆదేశాల మేరకు డీఈవో ఆధ్వర్యంలో వారం రోజులపాటు ఈ శిక్షణ నిర్వహించినట్లు చెప్పారు. సీ, డీ గ్రూపు విద్యార్థుల ఉత్తీర్ణతే లక్ష్యంగా ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. శిక్షణా కార్యక్రమానికి సమన్వయకర్తలుగా ప్రధానోపాధ్యాయులు వరప్రసాద్, గోవిందరాజులు, వెంకట్రావులు వ్యవహరించినట్లు చెప్పారు. కార్యక్రమానికి ఆతిథ్యం ఇచ్చిన ఎంఏఎం కళాశాల యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే శిక్షణ కోసం అవసరమైన మెటీరియల్‌ను తయారు చేసిన డీసీఈబీ సెక్రటరీ కృష్ణానాయక్‌కు, శిక్షణ ఇచ్చిన సబ్జెక్టు రిసోర్సు పర్సన్‌కు అభినందనలు తెలిపారు.

ఏపీఎన్‌జీజీవోస్ అసోసియేషన్ నరసరావుపేట శాఖ ఎన్నిక ఏకగ్రీవం

నరసరావుపేట టౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్‌జీవో హోమ్‌లో సోమవారం ఏపీఎన్‌జీజీవోస్ అసోసియేషన్ నరసరావుపేట శాఖ ఎన్నిక ఎకగ్రీవం అయిందని ఎన్నికల అధికారి ఏవీ కోటేశ్వరరావు తెలిపారు. నరసరావుపేట తాలూకా అధ్యక్షుడుగా తేలప్రోలు శ్రీనివాసరావు, సెక్రటరీగా షేక్ జానీబాషా, ట్రెజరర్ షేక్ పెద్ద అల్లాభక్షు, ఉపాధ్యక్షుడిగా కే.ఏడుకొండలు, జీ శ్రీరామ్, సీహెచ్ ఆంజనేయులు, పీ పుండరీకాక్షయ, మహిళా ఉపాధ్యక్షుడిగా ఆర్.మాణిక్యమ్మ, ఆర్గనైజింగ్ సెక్రటరీగా బీఎస్ రామానుజన్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శులుగా ఈ జయకుమార్, పీ విజయకుమారి, కే లక్ష్మికుమారి, నాగగణేష్, సంయుక్త మహిళ కార్యదర్శిగా బీ అరుణ, డీఈసీ మెంబర్లుగా ప్రతాప్‌కుమార్, ఏవీ సత్యనారాయణరాజు, జయశంకరరావు, ఏకగ్రీవంగా ఎన్నిక అయ్యారు. కార్యక్రమంలో ఉమ్మడి గుంటూరు జిల్లా అధ్యక్షుడు ఘంటసాల శ్రీనివాసరావు, కార్యదర్శి శ్యామ సుందర శ్రీనివాస్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు షేక్ నాగూర్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.



వైద్య శిబిరంలో రోగులను పరీక్షిస్తున్న జిల్లా మలేరియా అధికారి నజీర్

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

● జిల్లా మలేరియా అధికారి నజీర్

ఈపూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా దోమల నివారణ జరుగుతుందని డెంగీ, మలేరియా, టైఫాయిడ్ వంటి వ్యాధుల బారి నుంచి రక్షించబడతామని పల్నాడు జిల్లా మలేరియా అధికారి నజీర్ మండలంలోని ఊడిజర్ల ఎస్సీ కాలనీలో నిర్వహిస్తున్న వైద్య శిబిరాన్ని సోమవారం ఆయన సందర్శించారు. వైద్య శిబిరంలో చికిత్స పొందుతున్న రోగులను పరామర్శించారు. అనంతరం ఇంటింటికి వెళ్లి పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా టైర్లు, కొబ్బరి బోండాలు వంటి వాటిలో నీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. అదేవిధంగా పరిశుభ్రమైన నీటిని తాగాలని సూచించారు. ఇంటింటి సర్వే చేసి రోగులను సేకరించారు. కార్యక్రమంలో కొచ్చర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సుచరిత, వైద్య, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



చంద్రన్న బీమా చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి, తదితరులు

చంద్రన్న బీమా చెక్కుల పంపిణీ

చిలకలూరిపేట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): పార్టీని నమ్ముకున్న కుటుంబాలకు చంద్రన్న బీమా ఆపన్నహస్తమని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు సోమవారం అన్నారు. పట్టణంలోని సుబ్బయ్యతోటలో మృతిచెందిన మద్ది శివశంకర్ గుప్తా ఇంటికివెళ్లి కుటుంబసభ్యులను పరామర్శించి శివశంకర్ సతీమణి కన్యాకుమారికి రూ.5 లక్షల బీమా సొమ్మును అందించారు. క్యాంపు కార్యాలయంలో యడ్లపాడు మండలం కారుచోల గ్రామానికి చెందిన నల్లజాల రామకోటేశ్వరరావు సతీమణి శ్రీలక్ష్మికి చంద్రన్న బీమా చెక్కు. రూ.5 లక్షలను అందచేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ టీడీపీ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు రూ.2.10కోట్లు మంజూరు

చిలకలూరిపేట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట మండలం, పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు రూ.2.10 కోట్లు నిధులు మంజూరయ్యాయని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు సోమవారం తెలిపారు. నిధులు కేటాయించిన మంత్రి లోకేశ్‌కు, కేంద్ర ప్రభుత్వానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

● చిలకలూరిపేట: శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి ధర్మ సంఘం నూతన కమిటీ అధ్యక్ష, కార్యదర్శి, కోశాధికారులుగా ఎన్నికైన పసుమర్తి వెంకట సూర్యప్రకాశరావు, రాచుమల్లు సూర్యారావు, శిఖాకొల్లి సుబ్బారావులను ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు సోమవారం పట్టణంలోని గోశాలలో సత్కరించారు.

యువకుల మధ్య ఘర్షణ.. ఇరు వర్గాలపై కేసు

యడ్లపాడు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): యువకుల మధ్య జరిగిన వాగ్వివాదం ఘర్షణకు దారితీసింది. ఒక వర్గానికి చెందిన యువకులు ప్రయాణిస్తున్న ద్విచక్రవాహనాన్ని మరో సామాజిక వర్గానికి చెందిన యువకులు ప్రయాణిస్తున్న ద్విచక్రవాహనం వెనుక నుంచి ఢీకొట్టడంతో ఇరువర్గీయులు ఒకరిపై ఒకరుదాడులకు పాల్పడ్డారు. ఆదివారం సాయంత్రం యడ్లపాడుకు చెందిన యువకులు ద్విచక్రవాహనంపై సర్వీసు రోడ్డులో ఎర్రకొండ వైపు నుంచి సెంటర్ వైపు వస్తుండగా కొత్తూరు సమీపంలో హఠాత్తుగా ఆగటంతో ముగ్గురు ప్రయాణిస్తున్న ద్విచక్రవాహనం వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో యువకుల మధ్య వాగ్వాదం, ఘర్షణ జరిగింది. అక్కడ ఘర్షణను నివారించేందుకు ఏడుకొండలు అనే వ్యక్తి వెళ్లాడు. అనంతరం యువకులు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు వెళ్లగా అక్కడకు వెళ్లిన ఏడుకొండలుపై యువకులు దాడిచేశారు. అనంతరం ఏడుకొండలు వర్గీయులు పెద్దసంఖ్యలో పోలీస్ స్టేషన్‌కు చేరటంతో పోలీసులు లాఠీచార్జి చేసి వారిని పంపివేశారు. పోలీసులు విచక్షణారహితంగా దాడి చేశారంటూ కొందరు జాతీయరహదారి సర్వీసు రోడ్డుపై కొద్దిసేపు ధర్నాకు దిగారు. ఘర్షణకు సంబంధించి ఇరువర్గాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ శివరామకృష్ణ తెలిపారు. సంత్‌బాబుపై దాడిచేసిన బాషా మరో ఇద్దరిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద, విషయం గురించి మాట్లాడేందుకు స్టేషన్‌కు వచ్చిన ఏడుకొండలుపై దాడిచేసిన అనంతరాజు మరికొందరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

వడ్డెరలపై జరుగుతున్న దాడులను అరికట్టాలి:శ్రీధర్

తెలుగు రాష్ట్రాలలో వడ్డెర్లపై జరుగుతున్న దాడులను, అక్రమంగా కేసులు పెట్టడాన్ని అరికట్టాలని వడ్డెర సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు పీట్ల శ్రీధర్ డిమాండ్ చేశారు. సోమవారం వడ్డెర సంక్షేమ సంఘం నాయకులు యడ్లపాడులో పర్యటించారు. హైస్కూల్ రోడ్డులో సమావేశమై ఆదివారం జరిగిన దాడుల గురించి ఆరా తీశారు. అనంతరం ర్యాలీగా స్టేషన్‌కు వెళ్లి వినతిపత్రం అందజేశారు. లాఠీచార్జి చేసిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కింద నమోదు చేసిన కేసును ఎత్తివేయాలని కోరారు.

పోలీస్ కార్యాలయంలో పీజీఆర్ఎస్‌కు 111 ఫిర్యాదులు

నరసరావుపేట లీగల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో జిల్లా ఎస్పీబీ కృష్ణారావు ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. వివిధ అంశాలకు సంబంధించి మొత్తం 111 ఫిర్యాదులు అందాయి. చిలకలూరిపేట మండలం కావూరుకు చెందిన ఓ యానిమేటర్ తన బ్యాంక్ ఖాతాలో ఉన్న నగదు తనకు తెలియకుండా వేరే ఖాతాకు బదిలీ అయ్యాయని, రొంపిచర్ల గ్రామంలోని ఓ డైరీ వారు వ్యర్థ జలాలను వాగులోకి వదలడానికి పైపులు వేశారని వాటిని తొలగించాలని ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో పరిపాలన ఎస్పీ జేవీ సంతోష్ సిబ్బంది పాల్గొన్నారు.

చిన్నజీయర్‌ను దర్శించుకున్న జీవీ దంపతులు

వినుకొండ, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బోస్ బొమ్మ సెంటర్ వద్ద ఉన్న జీయర్ నిలయానికి త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ చిన్న జీయర్ స్వామి సోమవారం వచ్చారు. ఆయన నిర్వాహకురాలు భవనాసి మల్లిక పరమపదోత్సవంలో చిన్న జీయర్ స్వామి పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్న జీయరుస్వామిని చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు, లీలావతి దంపతులు దర్శించుకున్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు షకీలా దస్తగిరి, పీవీ సురేష్ బాబు, భవనాసి మల్లిక ప్రసాద్, బొగ్గవరపు ముత్తు శ్రీనివాసరావు, స్వాతి, అచ్యుత, శ్రీధర్‌బాబు, శ్వేత, భక్తులు,శిష్యులు, ప్రజలు, కూటమి పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కవి కరీముల్లాకు ఘన సత్కారం

వినుకొండ టౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): వినుకొండకు చెందిన కవి కరీముల్లాకు గుంటూరులో ఆవాజ్ జిల్లా మహాసభలలో ఘన సత్కరించారు. మత సామరస్యానికి, లౌకిక విలువలకు కట్టుబడి సామాజిక స్పృహతో గొప్ప కావ్యాలు రాసిన కరీముల్లాను ఆవాజ్ జిల్లా నాయకులు చిస్టీ తదితరుల ఆధ్వర్యంలో సన్మానించారు.

పంట కోత ప్రయోగంపై అవగాహన

ఈపూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): పంట దిగుబడుల అంచనాలో పంట కోత ప్రయోగం చాలా కీలకమైనదని మండల సహాయ గణాంకాధికారి అన్నారు. ఈపూరు రైతు సేవ కేంద్రంలో మండల వ్యవసాయ అధికారి రామారావు అధ్యక్షతన సోమవారం పంట కోత ప్రయోగంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

కారుమంచిలో అంతర్జాతీయ సహకార వారోత్సవాలు

కారుమంచి (శావల్యాపురం) నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కారుమంచి సొసైటీ కార్యాలయంలో 72వ సహకార వారోత్సవాలను సొసైటీ చైర్మన్ గోపాళం శివప్రసాద్ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. సొసైటీ ఆవరణలో సహకార జెండా ఎగురవేశారు. గాంధీ, నెహ్రూచిత్రపటాలకు పూలమాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్ గద్దె వీరమస్తాన్‌రావు, ఎంపీటీసీ యూనిట్ ఇన్‌చార్జి కోటా హరిబాబు, టీడీపీ గ్రామ అధ్యక్షుడు ముప్పా గిరిప్రసాద్, నేత వెంకట్రామయ్య, సొసైటీ సీఈవో వైవీ నారాయణ, ఏఈవో రామారావు పాల్గొన్నారు.

● నరసరావుపేట రూరల్: జాతీయ సహకార వారోత్సవాల్లో భాగంగా నరసరావుపేట మండలం ఇక్కుర్రు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం నందు సహకార వారోత్సవాల కార్యక్రమం సంఘ చైర్ పర్సన్ కొల్లి వెంకటేశ్వర్లు పతాక ఆవిష్కరణ చేశారు. కార్యక్రమంలో కో ఆపరేటివ్ అధికారి స్వర్ణ చిన్న రామిరెడ్డి, సీనియర్ ఇన్‌స్పెక్టర్ డి.రవికుమార్ సహకార సూత్రాల గురించి వివరించి సహకార ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సంఘ డైరెక్టర్స్ చెరుకూరి కావేరి, మాజీ ఎంపీటీసీ సభ్యుడు కనుమూరి రమేష్, సంఘ సీఈవో కంటు.శ్రీనివాసరావు, సిబ్బంది బి.రమేష్ పాల్గొన్నారు.